కామ్రేడ్స్
భూమయ్య, కిష్టాగౌడ్‌ల
ఉరిశిక్షలు రద్దు కావాలి

మీరెంత సామాన్యులు
మట్టిలో పుట్టి, మట్టిలో పొర్లాడి
పోరాడి
మహోన్నత శిఖరాల కెదిగినారు

పల్లె మీ తల్లి
పొలం మీ బడి పని మీ చదువు
అనుభవం మీ గురువు
ప్రజలు మీ ప్రాణం

పోరాటం మీ పాఠం
విప్లవం మీ గురి
మీరెంత అసామాన్యులు

# సృజన

జనవరి 1975

64

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

**64**

జనవరి **1975**

కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లకు అంకితం

నిర్వాహకులు
'సాహితీ మిత్రులు'

*150* పైసలు

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by **P. Hemalatha** for 'Sahithee Mithrulu'
**Printed at Venkataramana Mudranalayam,**
J.P.N. Road, Warangal-506002 (A.P.).

# నిస్వార్థ ప్రజాసేవకులకు ఉరితాళ్ళైన ఫాసిస్టు రాజ్యాంగ చట్టాలు సాయుధ రైతాంగ విప్లవజ్వాలలకు ఆహుతి అవుతాయి

'సర్వేజనాః సుఖినోభవంతు' ప్రజలందరి సుఖసంతోషాలకోసం తాము తయారుచేసిన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మహత్తరదినం 26వ జనవరి కాబట్టి అందరూ పండుగచేసుకోండి అంటున్నారు ఏలినవారు. పాలకవర్గం పూజించు మని చెప్పుతున్న భారత రాజ్యాంగం నిజానికి బ్రిటన్, అమెరికావంటి సామ్రాజ్యవాద దేశ రాజ్యాంగాల సంకరరూపమే. వాటికిపుట్టిన వికృత శిశువేతప్ప వేరుకాదు.

ఉత్పత్తి సాధనాలు చేజిక్కించుకొన్న దోపిడీవర్గ ప్రయోజనాలు కాపాడడానికే యీ రాజ్యాంగచట్టాలూ, యిక్కడి ప్రభుత్వ యంత్రాంగమూ. ఈ రాజ్యాంగం చెప్తున్నట్టు. యిక్కడి న్యాయస్థానాలు స్వతంత్రమైనవి కావు. ఎవరిని నిర్బంధించాలో, ఎవరిని ఎక్కడ కాల్చిచంపాలో, ఎవరిని ఉరితీయాలో, ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

రాజ్యాంగంయిచ్చే ఆస్తిహక్కు, వ్యాపారస్వేచ్ఛా పెట్టుబడిదార్ల చేతికందినంత చిక్కించుకోడానికే.

రాజ్యాంగంలో రాయబడ్డ వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం సమ్మెచేసే హక్కు, యింకా బోలెడు స్వాతంత్ర్యాలూ, హక్కులూ నిజంగానే ఉన్నాయనుకొని ఎవరైనా సమ్మెలుచేశారో, పాలకుల పాపాలగూర్చిరాశారో ఎక్కడైనా సభల్లోచెప్పారో జైళ్ళు నోళ్ళుతెరుచుకుంటై, చట్టాలు మెడకు ఉరితాళ్ళై బిగుసుకుంటై.

మతాన్ని, సారస్వతాన్ని, సమస్తకళల్ని, రేడియో పత్రికలనూ, విజ్ఞాన శాస్త్రాన్నీ యీ ప్రభుత్వం తన దోపిడీవిధానాల సమర్థించడానికే, వాస్తవ పరిస్థితుల మరపించి ప్రజల జోకొట్టడానికే ఉపయోగించుకొంటున్నది. అకాడమీ అవార్డులూ, ప్రభుత్వపరంగా సాగే భాషా సాంస్కృతిక ఉత్సవాలూ అన్నీ యిందుకోసమే. వెన్నెముకలేని యువకుల తయారుచేసే విద్యా విధానమూ యిందుకోసమే

అవినీతి, అధికధరలు, నిరుద్యోగం, నిత్యదారిద్ర్యం, అనారోగ్యం ఆకలిచావులు అవమానాలు, ఆత్మహత్యలూ 27 ఏళ్ళ భారత రాజ్యాంగపాలన పేదలకిచ్చిన కానుకలు. ఈ దోపిడీవ్యవస్థ నిర్మూలనకూ, సమసమాజస్థాపనకూ సాయుధపోరాటమే ఏకైకమార్గమని పోరాడుతున్న విప్లవకారులమీద, విప్లవభావ ప్రచారంచేస్తున్న విప్లవ రచయితలమీద, న్యాయమైన హక్కులకోసం పోరాడుతున్న కార్మిక కర్షకజనంమీద, విద్యార్థి యువజనులమీద, తీవ్రమైన ఫాసిస్టు దమనకాండను, మారణహోమాన్ని సాగిస్తున్నదీ నిరంకుశ దోపిడీప్రభుత్వం. విచారణలేకుండా ఏళ్ళతరబడి నిర్బంధంలోపెట్టి, కాల్చిచంపి ఉరిశిక్షలువేసి తన క్రూరమైన వర్గ స్వభావాన్ని ప్రదర్శిస్తున్నది. ప్రజాపోరాటాల నెత్తురుటేర్లలో ముంచుతున్నది. నిజంగా భారతరాజ్యాంగం కోట్లాది శ్రమజీవులకు వ్యతిరేకంగా అల్లిన ఉరితాడు. భారత నిరంకుశ దళారీ భూస్వాములు, పెట్టుబడిదార్లు సామ్రాజ్యవాదులతో మిలాఖతయి యిక్కడి శ్రమజీవులకు వ్యతిరేకంగా పన్నిన అంతర్జాతీయకుట్ర. కాళీపట్నం రామారావుగారన్నట్లు యిది ప్రజలమీది ప్రభుత్వమేకాని ప్రజలదిమాత్రం కాదు

ప్రజలతో నిమిత్తంలేకుండా ఆర్డినెన్సులతో, ఎడతెగని రాజ్యాంగ సవరణలతో, భద్రతాచట్టాలూ, రక్షణచట్టాలతో, యింకా అనేక నీచమైన ఎత్తుగడలతో, భారత ప్రభుత్వం రాక్షసరాజ్యం సాగిస్తున్నది. ఇక్కడి పాలకవర్గందృష్టిలో సామాన్యప్రజలు అత్యంత అప్రధానులు. అల్పులు. Insignificant creatures.

ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భగత్‌సింగ్, అనంత్‌సింగ్‌లాంటి విప్లవవీరులకు ఉరితీసి భారత విప్లవాన్ని ఆపేశామని చంకలుగుద్దుకుంటే, యీనాడు వారి తొత్తులైన భారత పాలకవర్గాలు ప్రజాసేవయే జీవితధ్యేయంగా, ప్రజలకోసం ప్రాణాలు తృణప్రాయంగా ఎంచిన ఆదిలాబాద్ సాయుధ రైతాంగ గెరిల్లావీరులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లపై ఉరిశిక్షలు విధించి తమ పూర్వీకుల నిజమైన వారసులమని నిరూపించుకున్నారు.

ఏ బ్రిటన్‌వద్ద తాను రాజ్యాంగ సూత్రాలను అరువుతెచ్చుకున్నాదో, ఆ బ్రిటన్‌తో సహా 34 ప్రపంచ దేశాలు ఐ.రా.స. తీర్మానంమేరకు అనాగరికమైన 'ఉరిశిక్షలు' రద్దుచేసినా, అహోరాత్రాలు, అహింసామంత్రాలు జపించే భారతగాంధేయ ప్రభుత్వంమాత్రం 'ఉరిశిక్ష'ను తన శిక్షాస్మృతిలో అట్టేపెట్టుకొన్నది. తన క్రూరమైన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే విప్లవవీరులను, ప్రజాసేవకులను చట్టబద్ధంగా హత్యచేయడానికీ యీ ఉరిశిక్షలను ఆయుధంగా ఉపయోగించుకొంటున్నది. హిట్లరు పాలనను సైతం మరిపిస్తున్నది.

కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుకై కార్మికులు, కర్షకులు, విద్యార్థి యువజనులు, రచయితలు మేధావులు కదలి పెద్దయెత్తున ఆందోళ సాగించాలి. ఉరిశిక్షలు వాయిదావేయడంకాదు కావలసింది. అవి పూర్తిగా రద్దుకావాలె.

దోపిడీవర్గాలకూల్చి వారి నిరంకుశ రాజ్యాంగచట్టాల కాల్చడానికి, శ్రమజీవులంతా సాయుధ పోరాటజ్వాలల్ని వెలిగించాలె. ఇది విప్లవాలయుగం. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు. విప్లవ విజయం అనివార్యం. తరుగులేని యీ ఎరుపుసత్యాన్ని గుర్తించ నిరాకరించి దోపిడీ పాలకవర్గం తన నిరంకుశ చట్టాలతో ప్రజాపోరాటాల అణచాలనుకొంటే విప్లవ రథచక్రాలకింద ముక్కలై పోక తప్పదు.

1. కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్షలు రద్దుకావాలి.
2. నిరంకుశ దోపిడీ రాజ్యాంగచట్టాలు నశించాలి!
3. సాయుధ విప్లవం వర్ధిల్లాలి!

# కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల వాయిదాకాదు, రద్దుచేయాలి.

భగత్‌సింగ్ తరువాత, భారత రైతాంగ విముక్తిపోరాటంలో నక్సల్‌బరీ తరువాత, తొలిసారిగా రాజకీయ కారణాలకొరకు ఉరిశిక్షకు గురైన రైతాంగ గెరిల్లాయోధులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్, దాదాపు 3 ఏళ్ళుగా సికింద్రాబాద్ జైల్ కండెమ్డ్ సెల్సులో మగ్గిపోతున్న యీ కామ్రేడ్లకు రాష్ట్రపతి ఉత్తర్వు అయి డిసంబర్ 26 ఉదయం 4-30 గంటలకు ఉరిశిక్ష అమలు జరుపబోతున్నారన్న వార్త 25 ఉదయానికే తెలిసి జైలులంతా విషాదం పాకిపోయింది. ఆరోగ్యంగా, సజీవంగా అందరి హృదయాలలో అన్నలుగా, తమ్ములుగా దాదాపు 3 ఏండ్లనుండి మసలుకొంటున్న రెండు నిండు ప్రాణాలు తీయడానికి ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. ఆ ఉదయం ఆకాశంలో సూర్యునికి అర్థంలేదు. ఆరోజు ఖైదీలుమాత్రమేకాదు జైలు సిబ్బంది మొహాల్లో ప్రాణంలేదు. ఏవో నీడలు- జైలు తల్లడిల్లిపోయింది.

ఎన్నోనెలలుగా ప్రతిసారీ నిరాకరింపబడి ఇక 20 గంటలకు ఉరికంబం ఎక్కబోతారనగామాత్రమే భూమయ్య కిష్టాగౌడ్‌లతో ఆ జైల్లోనేఉన్న విప్లవ రచయితలు మొదలైనవారికి యింటర్వ్యూ లభించింది. కొన్నిగంటల్లో మృత్యుకౌగిలిలోకి వెళ్ళబోతున్న ఆ కామ్రేడ్స్‌లో ఏ మార్పూలేదు. కటకటాలవెనుక కండెమ్డ్‌సెల్సులో కళ్ళలో వెలిగిపోతున్న కాంతితో యినుప శలాకలవలె కామ్రేడ్స్ భూమయ్యా కిష్టాగౌడ్.

"16వ ఏటనుండి పోరాటంలోవున్నాం- పోరాటంలో బతికాము- పెరిగాము- పోరాటంకోసం ప్రాణాలిస్తున్నాం- మాకు ఎంతో తృప్తిగావున్నది- మా కుటుంబాలున్నయి- మీరున్నరు- పోరాటంవుంటుంది- గాంధీని చూసాం- విన్నం- గాంధీమాటలకు విలువలేదు- ఎక్కడుంది అహింస? పాపం, జయప్రకాశ్‌కూడ అదేచెప్తున్నాడు. కాని లాభంలేదు- అది తోవకాదు- ప్రజలకు ద్రోహంచేసినవాళ్ళను కాళ్ళుచేతులు విరగ్గొట్టి జీవితాంతం శిక్ష అనుభవించేటట్లు చేయాలె. మేమేంచేసినా ప్రజలకోసమే చేసాం. ఇంకా ప్రజలకోసం ఎన్నోచేయాలనుకుంటుండగా యీ జైలుపాలయ్యాం"- అన్నాడు కిష్టాగౌడ్. యింటర్వ్యూకి వెళ్ళినవారితో- గ్రామాల్లో తెలంగాణా సాయుధపోరాటకాలంనుంచి యీనాటివరకు భూస్వాములు, పెత్తందార్లు, పోలీసులుచేసిన, చేస్తున్న పాశవికమైన హింస, పేదలపట్ల, స్త్రీలపట్ల వాళ్ళ అమానుషమైన ప్రవర్తన హృదయవిదారకంగా వివరించాడు. ఈనాటికీ బెంగాల్, బీహార్, ఒరిస్సాజైళ్ళలో యిలాంటివి, యింతకన్నా క్రూరమైనవి ఎలాజరుగుతున్నాయో విప్లవ రచయితలు వాళ్ళకు చెప్పారు. "ఇవితీస్తే ప్రమాదమని డాక్టర్‌చెప్పాడు, ఇవి పోరాటంగుర్తులుగా నాతో వుండిపోయాయి" పోరాటంలో తన తొడలోనూ, కాలి మడమలోనూ దిగిన తూటాలనుచూపిస్తూ అన్నాడు కిష్టాగౌడ్.

ఈ జైలుకు రాకముందు మాకు అక్షరాలుకూడ రాయరాదు- రిమాండ్‌లోనే అక్షరాలు నేర్చుకున్నాం- ఈ ముషీరాబాద్ జైలుకువచ్చినాక సత్యమూర్తన్న మా పక్కసెల్‌లో 6 నెలలు వున్నాడు- ఆ 6 నెల్లూ మాతోచేలోకమూ అన్నది. పాటలు, చదువు, రాజకీయాలు ఆయననేర్పినవే"అన్నాడు కిష్టాగౌడ్. "ఆ అన్నకు మా రెడ్ శాల్యూట్ చెప్పండి" అన్నారిద్దరూ.

ఉరితియ్యగానే తమకళ్ళు కళ్ళులేనివాళ్ళకోసం యివ్వవలసిందిగా రాసిచ్చారు. "మేముగా మా కళ్ళతో విప్లవాన్ని చూడలేకున్నా, మా కళ్ళు విప్లవాన్ని, విశాల ప్రపంచాన్ని చూస్తాయి" అంటారా కామ్రేడ్స్.

"విప్లవాలయుగం మనది / విప్లవిస్తె జయంమనదె- కష్టజీవులార మీరు / కుమిలి కుమిలి చావకండి- సాయుధపోరాట ప్రజా / సైనికులే జయిస్తారు ॥విప్ల॥- చెరసాలలు ఉరికొయ్యలు / వెలుగును బంధించలేవు- ప్రతినిమిషం పోరాడే / ప్రజలను భయపెట్టలేవు ॥విప్ల॥ విప్లవ రచయితల నినాదాలు పాటలు-

ఉరిశిక్ష అమలువార్త విన్నదగ్గరినుండీ డిసంబర్ 27 మధ్యాహ్నంవరకు అనధికారికంగా నిరాహారదీక్ష చేయాలని, సాయంత్రం, ఉదయం 4-30 గంటలకు (సరిగ్గా ఉరితీసే సమయం) నినాదాలుచేసి, సభజరుపుకొని కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌ల త్యాగాలగూర్చి, పోరాటంగూర్చి చెప్పుకోవాలని జైలులోపలి మా. లె. కార్యకర్తలు నిర్ణయించుకొన్నారు- సాయంత్రం నినాదాలుయిచ్చి, రాత్రంతా మేల్కొని ఆ యిరువురి కామ్రేడ్స్ జీవితం పోరాటం, మానవ చరిత్రలో వర్గపోరాటాలు, త్యాగాలుచెప్పుకొని ఉదయం 4-30 కి నినాదాలిచ్చి పాటలుపాడి 26వ తేదీని సంతాపదినంగా పాటించాలని జైలులోపలి విప్లవ రచయితలు సానుభూతిపరులు నిర్ణయించుకొన్నారు.

సాయంత్రమైంది. అసలు ఆ రోజు జైలుమీద ఉదయంనుంచే చీకటినీడలు- జైలులంతా విషాదనిశ్శబ్దం- బయట బలిసినవాళ్ళు ఇంకా కాలుస్తున్న దీపావళి మందుల చప్పుడు- కష్టజీవుల నిశ్శబ్ద ఆవేదనపై దోపిడీదార్లు, కుట్రదార్లు భయంకరంగా నవ్వుతున్నట్లున్నది. పిరికిగా తెల్లపోయి వెన్నెలకాస్తున్నది- ఒక్కసారి జైలు నిశ్శబ్దాన్ని విషాదాన్ని తొలగిస్తూ, రక్తాన్ని కవోష్ణభావాలతో కదుపుతూ నినాదాలు- "కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌లకు జోహార్లు, భారత రైతాంగ సాయుధపోరాటం వర్ధిల్లాలి! విప్లవం వర్ధిల్లాలి, సాయుధ పోరాట ఎర్రజెండా చిరకాలం వర్ధిల్లాలి!" జైల్లోని అన్ని బ్యారక్స్‌లోను "ఉరిశిక్షలు రద్దుచేయాలి- భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలి."అన్న నినాదాలు అందుకున్నారు- జైలంతా నినాదాల ప్రతిధ్వనులు.

3 సం. నుండి యీ చేతులతో అన్నంపెట్టావు. కావాలన్న వస్తువులు తెచ్చి యిచ్చావు. రేపు యీ చేతులతోనే ఉరివేస్తావా అన్నా?" అన్నాడట కిష్టాగౌడ్ ఒక పోలీసుతో- ఆ పోలీసు క్షోభపడుతున్న హృదయంతో చివరిసారిగా టీ తాగాలన్న వాళ్ళ కోర్కెను తీర్చడానికి పాలకోసం పోతున్నాడు

"మహా సంక్షోభం గొప్పశాంతికి దారితీస్తుంది."

రాత్రి 9 గంటల తరువాతవచ్చింది సంతోషవార్త. "తెల్లవారి ఉరిశిక్ష లేదు- ఆపివేశారు- అసలే ఉండదని చెప్పలేంకాని తెల్లవారిమాత్రం లేదు."అని- ఆ వార్త జైలంతా వెన్నెలవలె పాకిపోయింది. ఆ ఆనందాన్ని ఏమనిచెప్పగలరు. ఎవరైనా ఏమీ చెప్పకపోవడమే ఎంతోచెప్పినట్లు- ఉరితీసేవస్తువులు- గ్లిసరిన్‌పెట్టి మెరుస్తున్న ఉరితాళ్ళు- తలమీద కప్పడానికి తెచ్చినగుడ్డ- చేతులకుకట్టేతాళ్ళు- ఆ ఏర్పాట్లన్నీ క్రితం రోజు ఎంత భయంకరంగా కన్పించాయో యిప్పుడంత అర్థరహితంగా పడిఉన్నాయి.

ఉరిశిక్షలు ఆపవలసిందిగా ఉత్తర్వులు తీసుకొని రాష్ట్ర పౌరహక్కుల సంఘ కార్యదర్శి శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు వచ్చారట- ఇంతకూ కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్ ఎవరు? వీళ్ళకు ఉరిశిక్ష ఎందుకుపడ్డది?

48 ఏండ్లక్రితం కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి తాలూకాకుచెందిన ముత్తునూరు గ్రామంలో కోసుగంటి వీరమల్లయ్య, రాజవ్వ దంపతులకు జన్మించిన పసిబిడ్డడే నేడు ఉరిశిక్షకు గురియై సికింద్రాబాద్ జెయిల్లో ఒంటిగది కటకటాలనుండి భవిష్యత్తుకై ఎదురుచూస్తున్న కోసుగంటి (జంగం) భూమయ్య

అనూచానంగా జంగం దేవరలకు పరంపరాగతంగా సంక్రమించిన పూజారి వృత్తే భూమయ్యకూడ ఆచారించాడు- అయితే తనకున్న ఒక ఎకరమంత చెమటోడ్చి, రెక్కలువిరిచి, శ్రమపడి పంటపండించడమూ అలవాటే.

తాను యవ్వనంలో అడుగుపెట్టిన నాటినుంచీ కమ్యూనిస్టుపార్టీ సానుభూతిపరుడే. మహత్తర తెలంగాణా పోరాటంలోనే ఎర్రజెండాలు మోసుకొచ్చే చీకటిదొరలను పదిలంగా దాచిపెట్టడం అలవాటైపోయింది. అ పోరాటానికి విద్రోహంచేసి. ఎన్నికల సంరంభంలో పార్టీ దిగినతర్వాతకూడా ఎర్రజెండాకే ఓటువేశాడు. ఎర్రజెండాకే ప్రచారంచేశాడు.

నక్సల్‌బరీ పోరాటం కమ్యూనిస్టు పార్టీలోని రివిజనిజంపై తిరుగుబాటు మెల్లమెల్లగా 1969 నాటికి భూమయ్య గుండెల్లోకూడా కల్లోలంరేపింది. అప్పటినుండీ భారత కమ్యూనిస్టుపార్టీ (మా.లె.) సభ్యుడుగా శక్తికొలదీ రైతాంగ విప్లవపోరాటాభివృద్ధికి దోహదంచేశాడు.

1970 ఏప్రిల్‌లో ఆసిఫాబాద్ తాలూకాలో కమ్యూనిస్టు గెరిల్లాదళం పెర్కపల్లి గ్రామానికిచెందిన మాజీ పోలీసుపటేల్ బోడెకంటి మల్లయ్యనూ, గిన్నెదరి గ్రామానికి



చెందిన లచ్చుపటేల్‌నూ పేదప్రజల వాంఛానుసారంగా ఖతంచేసింది. ఆ సందర్భంలో ఆ ప్రాంతమంతటా నెలకొన్న భీకరపోలీసు నిర్బంధానికి తట్టుకోలేక భూమయ్య అజ్ఞాతవాసానికి వెళ్ళవలసి వచ్చింది. కాని ఎక్కువరోజులు గడవకముందే బంధువులే గదా అన్న భ్రమలో ఒకరాత్రి అత్తగారింటికి (పుట్నూరు) రక్షణకోసంవెళ్ళి భోంచేస్తున్న సమయంలో యీ కమ్యూనిస్టు గెరిల్లాను అతనిభార్య మేనమామ, విద్రోహి జంగం నిరంజనం పదిమందితోవచ్చి పట్టుకొని పోలీసులకు ఒప్పగించాడు.

తరువాత ధర్మారం, జగిత్యాల, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ తదితర అనేక పోలీసు స్టేషన్లలో చట్టవిరుద్ధమైన పోలీసుల కస్టడీలో చిత్రహింసలకు గురియైనాడు ఒక తిర్యాని సీయార్పీ క్యాంపులోనే నెలరోజులపైగా అక్రమ నిర్బంధంలో భరించలేని బాధలకు గురియవుతూ వుండవల్సివచ్చింది. మొత్తం 3 నెలల చట్టవిరుద్ధమైన పోలీసు కస్టడీనుండి చివరకు వరంగల్ జైలులోని చట్టబద్ధమైన జుడిషియల్‌కస్టడీ సంప్రాప్తమైంది- పెర్కపల్లి, గిన్నెదరి హత్యకేసులీతనిపై ఆరోపించబడ్డాయి. సాక్ష్యంలో బలంలేకున్నా, కేసుల్లో పసలేకున్నా ఆ జిల్లాలో భయకంపితులైన భూస్వామ్య కుభేరులు ముస్తుగా మేపిన 30 వేల రూ॥ల లంచం అపర న్యాయమూర్తులైన ఆదిలాబాద్ జిల్లా సెషన్స్ జడ్జిచేత ఒక విప్లవవీరునిపై మరణశిక్ష పలికించింది

ఆసిఫాబాద్ తాలూకాలోని కనర్‌గామ గ్రామంలో గున్నాల ఎల్లాగౌడ్. చిన్న కల్లకు పుట్టిన పసిబిడ్డడే పేదప్రజల విముక్తికై అనేక పోరాటాలలోపాల్గొని చిట్ట చివరికి యీనాడు 45 ఏండ్ల వయస్సులో సికింద్రాబాద్ జైలుఖైదీగా ఉరికంబం అంచుమీద నిలబడివున్న గున్నాల కిష్టాగౌడ్

తానెనిమిదేండ్ల బాలుడుగావున్నపుడే కుటుంబం తిర్యాని గ్రామం తరలిపోయింది. నూనూగు మీసాల యవ్వనప్రాయంలో రజాకార్ల, భూస్వాముల క్రూరచర్యలను సహించలేక, గుండెలుమండి అప్పటికే కమ్యూనిస్టుపార్టీ నడుపుతున్న రైతాంగ సాయుధ పోరాటంలోకి లంఘించాడు- అప్పుడు ప్రఖ్యాతిగాంచిన సిరిసిల్ల అమృతలాల్. గట్టుపెల్లి మురళి, ఎగిలాస్‌పురం మురళి, రాయిరాంపెల్లి రాజిరెడ్డి, తదితర ప్రముఖనాయకుల శిక్షణకింద మొక్కవోని చైతన్యంపొందాడు. అజ్ఞాతవాసంలో ఒక సం. కొరియర్‌గా, మరొక ఏడాది గట్టుపెల్లి మురళి అధ్వర్యానగల దళసభ్యుడుగా వీరోచితంగా పోరాటంలో పాల్గొన్నాడు. చివరికి పోలీసులచేజిక్కి వరంగల్ జైలులో 2 సం. వర్ణనాతీతమైన బాధలకు గురియవుతూ గడిపాడు.

అప్పటికే పార్టీనాయకత్వం సాయుధపోరాటానికి తిలోదకాలిచ్చి ఎన్నికల సంరంభంలో దిగింది. విడుదలైన కిష్టాగౌడ్ ఎక్కువరోజులు కాకమునుపే జిల్లారిపేట గ్రామపు ఈశ్వరమ్మను వివాహమాడి, శాశ్వతంగా అత్తవారింటనే కాపురం పెట్టాడు.

కులవృత్తిగా కల్లుగీచి ఇల్లు గడుపసాగాడు. తిరిగి 1969 జూన్‌లో మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీతో సంబంధాలేర్పడేంత వరకూ రక రకాలుగా కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికే ప్రచారంచేశాడు- సుత్తి కొడవలికే ఓటు వేశాడు. పదుగురుతో వేయించాడుగూడా. తన యింటిపై ఎర్ర జండానే ఎగురవేశాడు-

1969 వ సం. లో మహత్తర శ్రీకాకుళపోరాట ప్రభావం కిష్టాగౌడ్ హృదయంలో విప్లవం రేపిన నాటినుండి దీక్షగా, ఆదిలాబాద్ జిల్లాలో రైతాంగ గెరిల్లా పోరాటజ్వాలలు రగుల్కొల్పటానికి కృషిచేయసాగాడు.

1970 ఏప్రిల్‌లో పెర్కపల్లి, గిన్నెదరి-గ్రామాలలో కమ్యూనిస్టు గెరిల్లాదళం ప్రజాకంటకులైన వర్గశత్రువులను ఖతంచేయడంతో గున్నాల కిష్టాగౌడ్ అజ్ఞాత వాసానికి వెళ్ళిపోయాడు- కాని కమ్మరి నారాయణ అనే విద్రోహి కుట్రవల్ల 1970 అక్టోబర్ 10 నాడు లక్సెట్టిపేట తాలూకాలోని మాకులపేట గ్రామంలో భూస్వామ్యగుండాలచేత చిక్కాడు.

ఆదిలాబాద్ పోలీసుటానులో 25 రోజులు, సిర్పూరు పోలీసు స్టేషన్‌లో 2 నెలల 5 రోజులు మొత్తం 3 నెలల చట్టవిరుద్ధమైన పోలీసు కస్టడీలో అష్టకష్టాలు పడిన తర్వాత, చివరకు ఆసిఫాబాదు కోర్టులో హాజరుపర్చబడి, వరంగల్ జైలులో రిమాండు చేయబడ్డాడు- కేసులో బలంలేకున్నా సాక్ష్యంలో బరువులేకున్నా రుళ్వత్ సిరామింగిన జడ్జికలం యీ గెరిల్లాయోధునికి మరణశిక్షనే రాసింది.

ఈవిధంగా ప్రజలకోసం, విప్లవంకోసం తమ సర్వస్వం త్యాగంచేసి భయంకరమైన చీకటి రాత్రులలో కొండలు, నదీనదాలుదాటి పల్లెపల్లె తిరిగి ఎన్నో కష్టాలకోర్చిన విప్లవవీరులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్ విద్రోహంవల్ల పట్టుబడి యివ్వాళ ముషీరాబాద్ జెయిల్ కండెమ్డ్ సెల్స్‌లో తలలమీద ఉరితాళ్ళనీడలతో మగ్గిపోతున్నారు- నిస్వార్థ ప్రజాసేవకులు, విప్లవవీరులైన ఈ కామ్రేడ్స్ ఉరిశిక్షలరద్దుకై రాష్ట్రవ్యాప్తంగా పౌరహక్కుల సంఘాలు, విప్లవరచయితల సంఘం యింకా యితర ప్రజా సంఘాలు, వ్యక్తులు ఎన్నోసభలు సమావేశాలు జరిపారు. బెల్లంపల్లిలో 10 వేల జనంతో పౌరహక్కులసభ జరిగింది. రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ మోటూరి హనుమంతరావు ఇంకా అనేకులు ఉరిశిక్షలరద్దుకై డిమాండ్‌చేశారు శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు గారి అవిరామకృషి, గట్టి ప్రయత్నంవల్ల యిప్పటికి యీ ఉరిశిక్షలు వాయిదాపడ్డాయి.

అయితే కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌ల తలలమీద యింకా వేలాడుతున్న ఉరితాళ్ళ నీడలు పూర్తిగా మాసిపోవాలి. వీళ్ళ ఉరిశిక్షలేకాదు. అసలు అనాగరకమైన ఉరిశిక్షాస్మృతి రద్దుకావాలి అంతేకాదు యీ ఉరిశిక్షలకు, కుట్రలకు, దౌర్జన్యాలకు నెలవైన ఈ దోపిడీవ్యవస్థ రద్దుకావాలి. ఏ ఆశయంకోసం భగత్‌సింగ్ ఉరికంబమెక్కాడో, అసంఖ్యాక అమరవీరులు తమ రక్తంతో బాటలువేశారో, ఆ సాయుధపోరాట ఎర్రజెండాకింద నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను సాధించుకోడానికి, స్థాపించుకోడానికి విప్లవ శక్తులు ఉద్యమించాలె.

## ఆకాశంలో సగం నీవు

శివసాగర్

ఆకాశంలో సగం నీవు
అనంతకోటి నక్షత్రాల్లో
సగం నీవు సగం నేను
తూర్పు పవన సంగీతంలో
రాగం నీవు. తానం నేను
మనిద్దరం కలిసి
ఉద్యమిస్తే ఉప్పెన
మనిద్దరం కలిసి
విప్లవిస్తే విజయం
ఆకాశంలో సగం నీవు

విప్లవ పథంలో మనిద్దరం
ఒకరికొకరం బాస చేసుకునేవేళ

విప్లవ పథానికి మనిద్దరం
కలిసి కట్టుగా బాస చేసినవేళ
త్యాగం మన పేరు.
పోరాటం మన ఊరు.

ఆకాశంలో సగం నీవు
అనంత కోటి నక్షత్రాల్లో
సగం నీవు. సగం నేను
విప్లవాకాశంలో
నీవూ. నేనూ

"Women are the half of the sky"— *Chairman Mao*

## బుగతోడు - గూడు బండి

వి. ప్రసాదరావు

మైసూరెద్దులు - బండిని పూసీ- బుగతోడు-గూడుబండి
ఎద్దుల కొమ్ములు - రంగుల రాసీ బు॥గూ॥ ॥మైసూ॥
రంగులు రాసిన - కొమ్ములకేమే ,, ,,
గజ్జలు, గంటలు - మువ్వలుగట్టీ ,, ,,
పువ్వుల కొరడా - సేతిని బట్టీ ,, ,,
ఒక్కిపోతు నాగెక్కొడమ్మా ,, ,, ॥మైసూ॥

సాకల రేవూ - పాకలు దాటీ బు॥ గూ॥
గిలుగలు - గలుగిలు గిలుగిలుమంటూ ,, ,,
ఘణఘణ - ఘణఘణ మంటూ ,, ,,
గాలి మేఘమై - వత్తందదుగో ,, ,, ॥మైసూ॥

కందిమూటలూ - కంద దుంపలూ  బు॥ గూ॥
దండుకోని - దెంకెల్లడానికీ ! ,, ,,
దుమ్మల గుండుల - కొండల ,, ,,
దూలిలేపుకో... నొత్తందదుగో ,, ,, ॥మైసూ॥

కోడిపెట్టలూ - కూరతట్టలూ  బు॥ గూ॥
కుక్కిుకుక్కి - ఎక్కించడానికీ ,, ,,
కొంకి నక్కలా - కొండలకాసీ ,, ,,
రంకెలేసుకో... నొత్తందదుగో ,, ,, ॥మైసూ॥

ఎలంకాయలూ - నెలంకాయలూ  బు॥ గూ॥
ఏరుకుదొబ్బీ - ఎల్లడానికీ ,, ,,
ఎర్రిజిందవల - ఏటిదిబ్బలూ ,, ,,
ఎక్కుడు ఎక్కి - వత్తందదుగో ,, ,, ॥మైసూ॥

ఆనజకాయలు - అల్లంకొమ్ములు  బు॥ గూ॥
అల్లుడింటికీ - పంపడానికీ ,, ,,
కొండసెలవలా - బండలకాసీ ,, ,,
ఒంకరదిరిగీ - వత్తందదుగో. ,, ,, ॥మైసూ॥

తట్టలతోటీ - సింతపండురా  బు॥ గూ॥
మట్టిమట్టి - పట్టించడానికీ ,, ,,
తాటిసెట్టులూ - తంపరదాటి ,, ,,
తావరసెరువూ - గట్టెక్కింది ,, ,, ॥మైసూ॥

రాతిరిదాకా - రైతులసేతా  బు॥ గూ॥
పనిసేయించీ - సంపడానికీ ,, ,,
రాంపోతులా - రాతులుదాటి ,, ,,
రత్తంమట్టి - వత్తందదుగో ,, ,, ॥మైసూ॥

కూలి లేదనీ - సెప్పడానికీ  బు॥ గూ॥
వడ్డీ డబ్బులు - అడగడానికీ ,, ,,
గెడ్డతోవతో - అడ్డగదిరిగీ ,, ,,
గెంతులేసుకో... నొత్తందదుగో ,, ,, ॥మైసూ॥



గేదెలు మేసిన - పూదల మడిలో  బు॥ గూ॥
ఊబిలోదూరి - వుండలురాకా ,, ,,
గిడగిడ-గింజుకు - తన్నుకున్నదీ ,, ,,
ఎనక్కి ఎద్దులు - నక్కుతన్నవీ ,, ,, ॥మైసూ॥

సేలుపక్కకి - సేరకముందే  బు॥ గూ॥
పూరుకు - తూరుపుదిక్కున దిప్పీ ,, ,,
సిప్పకి సిప్పా - జారెయ్యాలీ ,, ,,
సీలకి సీలా - పీకియ్యాలీ ,, ,, ॥మైసూ॥

## కొత్తగూడెం అడవుల్లో....

కె.ఆర్. కిరణ్

కొత్త గూడెం అడవుల్లో
కొత్త వెలుగు లొచ్చెనంట
కోయజాతి అన్నలంత
ఒక్కటిగా కదిలిరంట
పుల్ల పుల్ల ఏర మనం కదలాలిరో
చీకట్లూ పారదోల అగ్గి చెయ్యరో
చీకట్లూ......
అడవిమీద మృగాలన్ని
కుట్రజేయు చుండెనంట
ఆడ మగా తేడా విడిచి
హతంజేయు చుండెనట
బాణాలూ సంధించి నడవాలిరో
పుట్టలన్నీ చచ్చుదాక కొట్టాలిరో
పుట్టలన్నీ......

కోయగూడెం మలువుల్లో
పోలిసోళ్ళు వున్నరంట
నక్సలైట్ల జాపమనీ
చావబాదు తున్నరంట
అందరమూ ఒక్కటిగా సాగాలిరో
రైఫిళ్లూ గుంజుకొని తరమాలిరో
రైఫిళ్లూ......
కలిగినోళ్ళ కారులన్నీ
పరుగులెత్తు చుండెనంట
కమ్మినిస్టు కంటబడితె
కాల్చివేస్త మన్నరంట
వర్గ శత్రు గుండెల్లో కత్తి దూయరో
నిరుపేదల ముక్తి కొరకు పోరు చేయరో
నిరుపేదల......

## కొలిమంటుకుంది

భూపాల్

మబ్బుల్లా గుడిశెకాడ
కొలిమంటూకున్నజాడ
సురకత్తులు కొడవళ్ళూ సంపియ్యాలే
సూరనన్న బంధూకు చేపట్టాలే
॥మబ్బుల్లా॥

భూస్వామి పొలమునిండ
మనకష్టా ఫలముంది
కొడవళ్ళూ చేతపట్టి కోసుకొవాలే
ఎదురొచ్చిన దొరగాన్ని ఏరెయ్యాలె
॥మబ్బుల్లా॥

కరణము కనకయ్య తాన
యేలిముద్రలున్న యిశాన
కాగితాలు కుప్పవోసి కాల్చెయ్యాలే
కరణపోడు అడ్డమొస్తె
కూల్చెయ్యాలె ॥మబ్బుల్లా॥

నాగులు పాటేలు ఇంట్ల
నాటు తుపాకుంధండ
నడిరాతిరి గోడదూకి ఎత్తుకెల్లాలే
పటేలోడు యెంటపడితె
పొతంజెయ్యాలె ॥మబ్బుల్లా॥

గవిని కుక్కలకు తోడు
ఉన్నడు గుండాలెల్లడు
పొద్దూక పొలముకాడికెదురెల్లాలే
పొల్లుమెదిర్నట్టుకాలుజెయ్యరి వాలే
॥మబ్బుల్లా॥

పాటేండ్లూ పిలిస్తే
పట్నము పోలీసొస్తే
గుట్టుమట్టుగా మనము జాగుండాలే
పిట్టల్ని కాల్చినట్టు కాల్చెయ్యాలే
॥మబ్బుల్లా॥

## పాలేరు స్మృతికి

జ్ఞానేశ్వర్

పాడెకట్లలో పడుకున్న జీతగా
నువు సచ్చింది బమ్మరాతకాదురా
దొరగాండ్ల చేతలే రాతలాయెరా
భూస్వాములకోతలే ఖర్మాయెరా
దోపిడీ వ్యవస్థయే దోచిందిరా
పామై కరిచిందిరా

పొలములో నాగలికి
గొడ్లతో గొడ్డైతివి
గోదాములు నింపితివి
దొరలనే మేపితివి
నీ దొక్కేమో చిప్పాయెరా
చిప్పలోన నిప్పులాయెరా

నీ బతుకు ఆరినా
యీ నిప్పులు ఆరిపోవు
యీ నిప్పులలోన పడి
యీ వ్యవస్థ మాడిపోవు-
యీ వ్యవస్థ మారిపోవు
కార్మిక కర్షక రాజ్యం
ఖరారుగా వచ్చి తీరు.

(పాలేరు ఉపేందర్ స్మృతికి)

వేలాది మృతవీరుల
ఆశయాలు మన వెంట
మన బాటలో
కోట్లాదికోట్ల పీడిత జనం—
మన యానం దీర్ఘమైంది.
బాట ముళ్ళదే కాని
భవిష్యత్తు ముళ్ళది కాదుగా!

ఎన్. కె.

కథ

## గోరంత దీపం

రుక్మిణి

కొండఒడ్డున అడవి కడుపులో ఆగా ఊరు. ఆచుట్టుపట్ల పదిహేను యిరవై గూడలకి అదొకటే ఊరు. ఆ రెండు మూడువందల కుటుంబాలూ పని పాటలకీ, రోజు వారీ దినుసులకీ ఆ ఊరిమీదే ఆధారపడతారు. ఆ ఊళ్లో ఓభూస్వామి ఉన్నాడు. కాదు, నిన్నటి వరకూ ఉండేవాడు ఇవాళ లేడు. పోలీసులు పోస్టుమార్టం కోసం అతనిశవాన్ని కూడా నిన్ననే పట్నం ఆస్పత్రికి పంపేసారు. అతని పెళ్లాన్నీ పిల్లల్నీ బావమరిదినీ ఉదయమే ఊరినుంచి తరలించేశారు, రక్షణకోసం.

ఊరు హోరెత్తిపోతూంది పోలీసుల గందరగోళంతో, పట్నంనుంచి పరుగెత్తుకు వచ్చాడు పటాలంతో సహా యినస్పెక్టరు. హత్యజరిగినతీరు అయోమయంగావుంది. ఛేధించవలసిన రహస్యంలేదు; అయినా కేసు కట్టడానికి ఆధారాలులేవు. హంతకులు వూరేగుతూ వచ్చారు, ఉపన్యాసాలిచ్చి వెళ్లారు. పెళ్తూగోడలమీద నినాదాలు రాసారు. అందులో పోలీసు కుక్కలకు హెచ్చరికలు చేశారు. హతుడి బంధువులు అందర్నీ చూశారు, అయినా ఎవర్నీపోల్చలేరు. ఆసామీ భార్యసంగతి మరీ చిక్కుగా చిత్రంగా వుంది. అవూసెత్తితేనే ఆవిడ మూర్ఛదానిలా విరుచుకుపడిపోతూంది. తిరిగి అరగంటకి గాని తెలివిరావడంలేదు. అంతా అయోమయంగా వుంది. పోనీదామ్మీకేసని కొట్టి పారెద్దామంటే అదీ వీల్లేదు. ఊళ్లో ఎవరికీ సంబంధంలేదు. వచ్చినవాళ్లు అయిదుగురట. గేటుదగ్గర యిద్దరు, యింట్లోవాళ్ల ని ఆపినది ఒకడు, నాయుణ్ణినరికింది ఒకడు. సరుకు సప్పరసవరించి నోట్లూపత్రాలూ తగలేసిందొకడు. అయిదుగురు తలపడి అంత అఘాయిత్యమూచేస్తుంటే వీళ్లందరూ నోళ్లతెరిచి చూస్తున్నారుట. ఇదేదో మహా కార్యంలాగ ఉపన్యాసాలూ గోడమీద రాతలూకూడాను అయినా యీ వెధవలకి సిగ్గూ శరములేదు. చీమూ నెత్తురూలేదు. అయిదుగురు వెధవల్ని అటకాయించలేక పోయారు. ఇంతపనిచేసి వాళ్లు బేఫికరుగా తిరుగుతూవుంటే, మళ్లీ మళ్లీ జనం వాళ్లకి జేజేలు కొడుతూవుంటే- యిది వూరా, వల్లకాడా? ఇక్కడ రాజ్యమూ పోలీసులూ అధికారమూ ఏమయినా వున్నట్టా వూడినట్టా? ఇవాళ తప్పించుకు తిరుగుతున్నారు. రేపు తలపడి దెబ్బలాడతారు. అనుమానం ఎందుకు, వాళ్లు చెప్తున్నదీ అదేకద. ఆలోచనలు జెట్ విమానాల్లా బుర్రలో గిర్రున తిరుగుతూవుంటే ఇనస్పెక్టరు తల పేలిపోయేలా వుంది. ఇంతకన్న ఘోరమైన హత్యలు చూశాడు. రాష్ట్రాలకి రాష్ట్రాలు దాటి పారిపోయిన హంతకుల్ని జుట్టుపట్టి ఈడ్చుకొచ్చాడు. పరమదారుణమైన

రైటింగ్‌కేసులు చూసాడు. అతి కిరాతకంగా అందర్నీ అణగ్గొట్టి దాసోహమనిపించాడు. కాని ఈ కేసు క్రాస్‌పర్డ్ పజిల్లావుంది మందీ మార్బలమూ హంగు అధికారమూ అంతా తన పక్షానవుండి ఆ నిముషంలో ఎందుకూ కొరగాని చవటలా కనబడుతున్నాడు తనకి తనే.

ఎవరువాళ్లు? ఎక్కడనుంచి వచ్చారు? ఎటు వెళ్ళారు? ఎలా వుంటారు? వాళ్ళ స్థావరం ఎక్కడ? ఏవిటి వాళ్ళ బలం? ఎందుకింత ధీమా? ఊరందరిమీదా వీళ్ళ అదుపుఏమిటి? వీళ్ళెందుకు పలకరు? భయమా. భక్తా? ఎక్కడైనా ఒక్క పగులువుంటే ఎలాగో ఓలాగ పెళ్ళలూడగొట్టి మొత్తం పగలగొట్టవచ్చు ఒక చిన్న క్లూ అయినా దొరకదేం? వేలిముద్రలూ కాలిజాడలూ పనిచెయ్యవు. ఐ విట్‌నెస్‌లు అంతకన్న నిరుపయోగం. ఏది దారి? ఎలా బేదించడం? ఇన్వెస్టిగేషన్ సాగడంలేదు. ఆలోచన తోచడంలేదు. ఉక్రోషం పట్టశక్యం కావడంలేదు.

ఊరుఊరంతా కుమ్మక్కయితే యిక ఎవడుమాత్రం ఏంచెయ్యగలడు. ఒక్కటే మార్గం—దండం దశగుణం భవేత్. ఓ దంపు దంచుతే ఎవడో ఒకడు పలక్కపోడు ఒక్కమాట. ఒక్కగుర్తు—అదిచాలు తను అల్లుకుపోగలడు. ఏదో ఒకటి కేసంటూ అల్లి ఆ మెజిస్ట్రేటు మొహాన తగలేస్తే అదే నడుస్తోంది కొన్నేళ్ళు. ఈలోగా ప్రమోషై పోవచ్చు. ఎవడికెవడు—అంతే అంతే.

మాలవాడనంతనీ మళ్లేసుకొచ్చారు. ఆడాళ్లనందర్నీ ఓచోట కూడేసారు. ముసలాళ్లనీ వయసులోవున్నోళ్లనీ వేరేవేరే మందవేసారు. కూలీల్నీ కూడులేనివాళ్లనీ అందర్నీ అన్ని వర్గాలవాళ్ళనీ దగ్గరకి తోలుకివచ్చారు. ఇనస్పెక్టరు లేనిచిరునవ్వ ప్రదర్శించాడు. అలవాటులేని ఉపన్యాసంయిచ్చాడు. మీ ఎవళమీదికీరాకుండా చూస్తాను. వాళ్ళెవరో, ఎటువెళ్ళేరో ఎక్కడుంటారో చెప్పండన్నాడు. ఇవాళ ఆ ఆసామికయింది రేపు మీకు కావచ్చు నన్నాడు. చచ్చువెధవల్లా నోరు మూసుక్కూచుంటే మిమ్మల్ని కూడ వాళ్ళు మిగల్చరుగాక మిగల్చరన్నాడు. తలుచుకుంటే అందర్నీ కట్టగట్టి కాల్చిగలనన్నాడు కేసు సాక్షమూ విచారణా కోర్టూ ఏం వీ అఖ్ఖర్లేదు యిక్కడికిక్కడే మిమ్మల్నందర్నీ మీ గుడిసెల్లోనే వేసి తగలెట్టేసి కమ్యూనిస్టులే వూరుతగలెట్టేసేరని సర్వం కామాపు చేసీగల్ను. నాసంగతి మీరెరగరన్నాడు. నేను రావణాసురుడి బాబుని జాగర్త అని అరిచాడు.

ఏవీ అనకుండానే ఆడవాళ్ళు ఏడవడం ప్రారంభించారు. శోకాలతోపాటు శాపనార్థాలు పెట్టారు. చచ్చినవాణ్ణీ తిట్టారు. చంపినవాళ్ళని తిట్టారు. దర్యాప్తుకొచ్చిన వాళ్ళని తిట్టారు. మొగుళ్ళనీ పిల్లల్నీ తిట్టారు. మొత్తుకున్నారు—వాళ్ళని వాళ్ళుతిట్టు



కున్నారు. నెత్తీనోరూ మొత్తుకున్నారు. నేలని పడబోయారు. గోలగోలచేశారు గందరగోళం చేశారు. వాళ్ళని ఆపడమే పెద్ద ప్రళయం అయిపోయింది. ముసలాళ్లు ముందే దణ్ణాలుపెట్టారు. "మారాజా. మారాజు మమ్మల్ని మీరే కాపాడాల: పెబువులు దయదలవాల" అంటూ దండకాలు ప్రారంభించారు. పిల్లలు పోలోపోలో మని గోలచేసారు. వయసువాళ్ళు మాకేంతెలుసునని ఎదురు ప్రశ్నలువేసి మొరాయించారు.

యువకుల్లో మెరికల్లాంటి వాళ్ళనో నలుగుర్ని ఏరి చెట్టుకట్టేరు. ఇనస్పెక్టరు మొలనున్న బెల్టుతీసి పశువునుబాదినట్టూ బాదడం ప్రారంభించాడు. ఓ పదిమంది పోలీసులు మిగతా యువకుల్ని మందవేసి గొడ్డునుబాదినట్టు బాదారు. అడ్డుగా పరిగెట్టిన ఆడవాళ్ళను గుండెలమీద కాళ్ళతోతన్ని పక్కకి తోస్సేరు. ఇనస్పెక్టరు కాళ్ళమీద పడ్డ ఓ పడుచును చితగ్గొట్టి గుడ్డలూడదీసి ముసలాళ్ళగుంపులోకి బంతిని విసిరినట్టు విసిరేసేరు ఇనస్పెక్టరూ బలగమూ శివమెత్తిపోయి నాలుగ్గంటలూ నానా హంగామా చేశారు. హైరాన పడిపోయారు. అలిసిపోయిన పోతులాగ జాంపోసిపోయి చతికిలపడ్డాడు యినస్పెక్టరు. నాయకుడు నడుములు పట్టుకుజేరబడిపోగానే లాఠీలు జారవిడిచేసేరు తక్కినవాళ్ళు.

ఇన్నిదెబ్బలూ తిన్నారు కాని. యిదీ సంగతని ఒక్కడూ అనడు. ఇకలాభంలేదు. ఒళ్లు పచ్చడయిపోతున్నా ఊళ్లోఉన్నంతసేపు యీ వెధవల్ని పలికించలేం. అందరూ కలిసివుంటే అదేధైర్యం అయిపోతూంది వీళ్ళకి. పొద్దువాలిపోతూంది ఇలా ఎంతసేపున్నా ఫలితంలేదు.

పక్క కేంపునుంచి తోడుతెచ్చుకున్న సబ్‌దార్నూ మెన్‌నూ పిల్చాడు. మెరికల్లాంటి మనుషుల్ని ఓ పదిమంది యువకుల్ని అనుమానించదగ్గవాళ్ళని ఎంచి పది మైళ్ళలోవున్నవాళ్ళ కేంపుకి తీసుకెళ్ళమన్నాడు తాను స్టేషన్‌కివెళ్ళి ఉదయం కేంపుకి వస్తానన్నాడు. సార్జంటును పిల్చి జీపురడీ చెయ్యమన్నాడు.

రెండురోజులు టైంయిస్తున్నాను. వాళ్ళని పట్టిస్తే సరేసరి లేపోతే మిమ్మల్నందర్నీ కట్టకట్టి బొక్కలో తోసేస్తాను. తరవాత ఏడిచినా మొత్తుకున్నా లాభంలేదు. వాళ్ళ ఆచూకీ చెప్తే వీళ్లు తిరిగొస్తారు. లేపోతే వీళ్ళని కేంపులోనే గొయ్యితీసి పాతేస్తాను ఎవడు ఏఅన్నలు మ్మా కిడ్డొస్తారోనేనూ చూస్తాను నేనసలే రాక్షసి ముండాకొడుకుని-పచ్చినెత్తురుతాగ్గలను బతకాలని ఆశుందోలేదో ఆలోచించుకోండి అని ఫైనల్ వార్నింగ్ యిచ్చి బయల్దేరాడు. జీపెక్కి యిద్దరు జవాన్లని ముందుకు పిల్చేడు. రాత్రికి యిద్దరు మెన్ యిక్కడుండండి అన్నాడు. ఊఁ ఆఁ అనకుండా జవాన్లు తలవేలాడేసి

రాళ్ళలా నిల్చుంటే. మళ్ళీతనే-సరే ఉదయాన్నే తగలడండి-రాత్రికి మీరూ ఆ కేంపుకె ళ్ళండి. యిక్కడుంటే మళ్ళీ రేపుమీకో పంచాయితీ చెయ్యాల అనిగసురుకున్నాడు. హెడ్ లైట్లు ఆన్‌చేసి జీపుకదిలిపోయింది.

పదిమంది యువకుల్ని తాళ్ళతో చేతులుకట్టి పశువుల లంకెల్ని తోలుకెళ్ళినట్లు రెండోవైపు సుబేదారూ సి. ఆర్. పి. వాళ్ళ పోలీసులు తోలుకెళ్ళారు.

కేంపులో యింకా దీపం పెట్టలేదు. కేంపు ముందు సెంట్రీకనిపించడంలేదు. రాజుభాయ్.గొంతెత్తి ఏదో పాడుతూవుంటాడెప్పుడూ. అదీ వినిపించడంలేదు. రెండు రోజుల ముందు కేంపుకి తెచ్చిన ఓ ఒక్కమనిషి అయిందానికీ కానిదానికీ పెద్దగా మూలుగుతూ అమ్మో నాయినో అని రాగయుక్తంగా అరుస్తూ వుంటాడు. వాడి అరుపులూ వినపడ్డంలేదు.

ఫర్లాంగు దూరంలో వుండగానే సుబేదారు గుండెలు గుబులుకున్నాయి. అయినా తొణకలేదు. ఈ సెంట్రీగాడిద తాగేసి నిద్దరోతున్నాడు గావాల, అయినా యీ అడివిలో బోర్‌క్కొడుతుంది మరి అనితనకి తనే సమాధానం చెప్పుకుంటూ గొణుక్కుంటున్నట్టు బయటకే అన్నాడు హిందీలో- హెచ్చరిస్తున్నట్టు గొంతెత్తి ఓ పెద్ద అరుపుఅరిచాడు కేంపువైపు.

తీరా కేంపులో అడుగెట్టబోయేసరికి ద్వారంముందు బోర్లాపడి వున్నారు సెంట్రీలిద్దరూ. సుబ్‌దార్ అగ్గిపుల్లగీసి లోనికి దారితీశాడు. ముందురోజు తెచ్చిన యిద్దరు మనుషులూలేరు. రిజర్వులో వుంచిన తుపాకులూ మందుగుండూలేవు. కాపలా వుంచిననలుగుర్లో యిద్దరు చచ్చిపడున్నారు. మిగతా రెండు శవాలూ ఏచెట్లకో వేలాడుతున్నాయా? ఏమో ???! ఉన్నవాడు ఉన్నట్టే ఉండిపోయాడు సుబ్‌దార్. రాత్రి జరిగిన హత్యకి చలించలేదు కాని పగలు జరిగిన యీ దాడికి దిమ్మెరపోయాడు సుబ్‌దార్.

ఓక్షణం నిర్ఘాంతపోయి. వెనుదిరిగి తాముతోలుకు వచ్చిన పశువుల మొహాల్లోకి చూశాడు. అలుముకు పోయిన ఆ చీకట్లో వాళ్ళ మొహాలమీద వెలిసిన విజయగర్వం కాని. బిగుస్తున్నవాళ్ళ పిడికిళ్లుకానీ వాడికి కనపళ్లేదు. ఎన్నటికీ వాడవి చూడ లేదు.

ఏకకంఠంగా వాళ్ళగొంతులున్నుండి పెల్లుబికిన "వర్గశత్రు నిర్మూలన వర్థిల్లా" లనే నినాదంతో అడివి అడివంతా ప్రతిధ్వనించింది.

"వ్యక్తిగత సౌఖ్యానికి ప్రలోభపడడంతోనే తరచుగా
బూర్జువా ఆలోచనా విధానం వైపు మొగ్గు మొదలవుతుంది."
— వుహి-చెన్

# శ్రామికుల వేదిక

శ్యామ్‌కుమార్

1946లో తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం జరిగిన సమయంలో మహో జ్వలంగ, అరుణారుణంగ వెలిగిన అగ్నికణం ఆ గ్రామం-భూమికోసం భుక్తికోసం ప్రజా రాజ్యధికారంకోసం గన్నులందుకొని పోరాడి వీరమరణ మొందిన వీరయోధులకు జన్మభూమి ఆ గ్రామం-వెట్టిచాకిరికి, నజ్‌రానాలకు, గులామ్‌గిరికి వ్యతిరేకంగ ప్రతిఘట నంలాంటి ఉద్యమాన్ని చేపట్టిన పీడిత తాడితుల పుట్టినిల్లు ఆ గ్రామం-భూస్వాములకు, దేశ్‌ముఖ్‌లకు, ఫాసిస్టుపాలనకు గోరికట్టాలని లేచిన కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయువు పట్టు ఆ గ్రామం.

'విప్లవం వర్ధిల్లాలి' 'దున్నేవాడిదే భూమి' 'ప్రజారాజ్యం వర్థిల్లాలి' అనే నినాదాలు ఆ గ్రామంలోని రైతుకూలీలు, కష్టజీవులు నిప్పుకంఠాలతో వినదించారు- అప్పుడు- ఇంటింట ఎర్రజెండాలు ఎగిరాయి. ప్రతికష్టజీవి చేతిలో ఎర్రజెండా రెప రెప లాడింది.

అక్కడవున్న అడివిని నరికి భూములుగా మార్చుకున్నారు- కల్లుగీయడం మానేసారు- సైన్యానికి, పోలీసులకు ఎలాంటిసహాయం చేయలేదు- నిత్యావసరాలకు ఉపయోగపడే వస్తువులు సైతం ఇవ్వనికి నిరాకరించారు. పైగా వాళ్ళను ఎదుర్కొన్నారు- వెంబడే తోకముడుచుకొని పోయింది పోలీసు మరియు సైన్యం.

భూస్వాముల, పెత్తందార్ల ఆస్తిపాస్తులన్ని లాక్కున్నారు ఆ గ్రామ ప్రజలు మొన్నటి శ్రీకాకుళంలోలాగ.

ఆ గ్రామంలోని ప్రతిపేదవాడు తమ మామూలు ఆయుధాలైన గొడ్డలి, తల్వార్, బరిసెలు, చాకులు ఇలాంటి వాటితో శత్రువునుండి తమను తాము రక్షించు కున్నారు. అడవుల్లో సాయుధదళాలు నాటుతుపాకులతోటి, గొడ్డలి, బరిసెలతోటి శత్రువును ఎదుర్కొన్నాయి.

మొట్టమొదటిసారిగ ప్రజారాజ్యాన్ని రుచిచూసిన తెలంగాణలో ఆదికూడ ఒక గ్రామం-ఆ గ్రామంలో ప్రజాకోర్టులుగూడ అవతరించాయి-ప్రజాసైన్యం సైతం ఆ గ్రామంలో కాలిడింది.

అప్పటికి ఇప్పటికి ఆ ప్రాంతంలోగాని ఆ గ్రామంలో గాని ప్రజల చైతన్యం ఒకటేలాగుంది. ఇంక ఇప్పుడు ఆ చైతన్యం, ఆ వర్గకసి రెట్టింపుకూడ అయింది. ఎందుకంటే ఆ నాటి పరిస్థితులకు ఈనాటి పరిస్థితులకు పోల్చుకుంటే అర్థమౌతుంది.

అలాంటి విప్లవచైతన్యం, విప్లవచేవ విప్లవ సంప్రదాయం కల్గిన గ్రామానికి ఆ మధ్యన వెళ్ళాల్సి వచ్చింది-నేను నాతోపాటు మా సాంస్కృతిక దళం.

ఆ ప్రాంతపు కార్యకర్తల సమావేశం ఆనాడే జరిగింది- అదే సందర్భంలో బహిరంగసభ ఏర్పాటుచేశారు. సభతర్వాత మా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి ఇదివారి కార్యక్రమం.

మేము సభాస్థలానికి వెళ్ళేసరికి వక్తలు మాట్లాడుతున్నారు. బహుశ అప్పుడే ప్రారంభమైయింది.

ఈ బహిరంగ సభ జరిగే కాలమందు వ్యవసాయదారులకు ఎరువుల ఇక్కట్లు చాలవున్నాయి-50 రూ॥ ఎరువు 125 రూ॥ ఇస్తామన్న ద్రొరకని పరిస్థితి అది అక్కడి కార్యకర్తలు ఈ విషయాన్ని తీవ్రంగ ఖండించారు. అక్కడి భూస్వాములకు, పెత్తందార్లకు, గ్రామ పెద్దలకు, సిఫార్సులమీద, బ్లాక్‌లో వారికి కావలసినంత మందురాబట్టుకొంటున్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వంలో మరోసారి తెలుసుకున్నారు ప్రజలు- ఈ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాసేదని.

వక్తలు దేశ పరిస్థితులన్ని వివరంగ ప్రజలకు తెలిజేస్తున్నారు. బ్యాంకుల జాతీయకరణ ఎవరికి ఉపయోగ పడుతుందో? భూమిగరిష్ఠ పరిమితులు ఏ విధంగ కుతంత్రాలతో కూడుకున్నదో? గరీబీహటావో ఎలా పరిణామం చెందిందో? మంత్రి వర్గాల అవినీతి లంచగొండితనం, పార్లమెంటు బూజు శాసనాలు ఇవన్ని తెలియజేసి, అసలు రైతుకూలి రాజ్యం సంపాదించుకోవాలంటే ఓట్లతోటికాదు. "తుపాకిగొట్టంద్వా" రాని తెలియజేశారు. అది నక్సల్‌బరి, శ్రీకాకుళంలో రగిలిన పోరాట పంథాలో నడవాలని ఉద్రేకంగ, ఉత్తేజాన్ని కలిగించేలా పూగిపోతు విద్యార్థి నాయకులు స్థానికులు వివరిస్తున్నారు.

ఇంతలో ప్రక్కనుండి ఏవోనినాదాలు, డప్పుచప్పుళ్ళు, ప్రవాహంలా తరంగాల హోరులా శబ్దం వినిపించింది. నేను అక్కడికి కొత్త-మా వాళ్ళు 'మేకప్‌రూమ్'లో వున్నారు. ఏమిటో? అని ప్రక్కకు వెళ్ళాను.

అదోపెద్ద ప్రవాహం అందులో చిన్నలు, ముసలోళ్ళు అందరున్నారు. తరతరాల దోపిడికి గురియై నరనరాన వర్గకసిని నింపుకొని కెరటాలు, కెరటాలుగా విరుచుకపడుతు. ఇక మమ్మల్ని ఎవ్వరు ఆపలేరు-'ప్రజాశక్తిముందు ఏశక్తి నిలవదు' అన్నట్లు ఎర్రజెండాలు ఎగరేస్తు ఉత్తేజం, చైతన్యం కంఠాల్లో ఉట్టిపడుతు "మావో జిందాబాద్" 'శ్రీకాకుళ పోరాటం వర్ధిల్లాలి' 'నక్సల్‌బరి పోరాటం వర్ధిల్లాలి' "పంచాది కృష్ణమూర్తి అమర్‌హై" "పంచాది నిర్మలకు జోహార్లు" అంటు రోమాలు సైతం నిలబడే రీతిగా



వూడిపోతూ ముందుకొస్తున్నారు- ఒకతను ఊరేగింపు నిలిపి ప్రక్కనున్న రాయిపై నిల్చొని తన శక్తినంత కూడదీసుకొని అమరవీరులకు జోహార్లు అర్పించాడు. అతనితో పాటు అక్కడి జనం కూడ నినాదాలుచేశారు.

ఆ చిన్న వూరేగింపు సభాస్థలానికి వచ్చేసింది. అందరు కూర్చున్నారు-నేను ఒకతన్ని అడిగాను "ఎక్కడనుండి వస్తున్నారు" అని

అతను పక్కూరునుండి వస్తున్నామన్నాడు. ఇంక అతని నుండి తెలుసుకుంది ఏమంటే ప్రతిసారి అంటే సభలకు వివిధ గ్రామాలనుండి ప్రజలు ఈ విధంగానే ఊరేగింపుతో సభాస్థలానికి వస్తారని.

పొడుగాటి కట్టెలకు ఎర్రజెండాలు రెపరెప మంటున్నాయి. సభాస్థలమంత ఎర్రజెండాలు నిండాయి. స్టేజిపైన పెద్ద,పెద్ద ఎర్రజెండాలు ఇరువైపులా తలయెత్తుకొని గంభీరంగ ఎగురుతున్నాయి.

సభకు హాజరైన నూటికి డెభై మందికి వొంటిమీద చొక్కాలే లేవు. తలకు ఇంత రుమాలుపేగు-ముడ్డికి ఇంతగోశిపేగు తప్ప వేరే బట్టలు ఏమీలేవు. పిల్లలకు చినిగిపోయిన చొక్కాలుతప్ప లాగులు లేనేలేవు- అక్కడ స్త్రీలు సైతం గోచీలుపెట్టి ఒళ్ళొంచి పనిచేస్తారు-చిన్న పిల్లాడినుండి ముసలతని వరకు కష్టపడి పనిచేస్తారు-పనిమీది నుండి అలాగే సభాస్థలానికి వచ్చారు.

ఈలోగా ఇంక రెండు చిన్న,చిన్న ఊరేగింపులు వచ్చాయి-వాళ్ళుఅక్కడికి ఐదు, ఆరుమైళ్ళదూరంనుండి 'లారి' పైనవచ్చారు వాళ్ళస్థితి గతులుకూడ పైనచెప్పినట్లే-

పోలీసువాళ్ళ మొఖాలమీద సంతోషం అసలేలేదు. బయనెట్లు ఎక్కుపెట్టి నిల్చున్నారు ఎప్పుడు ఏమిజరుగుతుందోని భయాందోళనలో వున్నారు.

సభాస్థలం కిక్కిరిసిపోయింది-యువకులు, పిల్లలు, కూలీలు అందరు శ్రద్ధగా వింటున్నారు-చూస్తున్నారు.

ఉపన్యాసాలు అయిపోయాయి

సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైయ్యాయి

సూదిపడ్డా శబ్దంవిని పించేంత నిశబ్దంగ వున్నారు ప్రజలు- స్టేజిపైన పాట చప్పుడు, గజ్జెలచప్పుడు తప్ప మరే చప్పుడులేదు.

కార్యక్రమాలు ఎలా సాగుతుంటే ప్రజలమొఖాల్లో రంగులు అలా మారుతున్నాయి.

కార్యక్రమం అయిపోవస్తుంది-ప్రజలనుండి నినాదాలు వచ్చాయి-కసితోకూడిన కంఠాలు అగ్నిలామండాయి చిన్న పిల్లలు సైతం పిడికిలెత్తి లేత కంఠాలతో నినదిస్తున్నారు.

వాళ్ళ వర్గకసిని చూస్తుంటే చారుమజుందార్ నిర్వచించిన భూమిలేనిరైతు కూలీల నుండి 'నూతన మానవుడు' ఉద్భవిస్తాడన్న విషయం నిజమేననిపించింది.

వాళ్ళ చైతన్యాన్ని, ఉత్తేజాన్ని చూస్తుంటే, మావో అన్నట్లు సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు పూర్తిగా నశించేకాలమిది. కార్మికులు రైతుకూలీలు పూర్తిగ తమరాజ్యం స్థాపించుకునే కాలమిదిఅని-

మినీ కథ:

## తీర్పు

రెడ్‌సన్

వెంకట్రావుడికాయేల మాసెడ్డ సిరాగ్గావుంది. 'ఎన్నాల్లీకష్టం' అని అనుకున్నాడు. మొదట్నించీ సింవ్వాద్రినాయుడంటే తనకి బయంవున్నా ఆ బయ్యంఎనక వాడిమీద కసి వుందని వాడే చాలాసార్లొప్పుకున్నాడు.

చెల్లెలిపెండ్లికి చేసిన రెండొందల అప్పుకింద తాళ్ళపక్క మెట్టపొలం రాయించుకున్నప్పుడూ, జీతంరాళ్ళు అప్పుడోపదీ ఇప్పుడోపరకా ఇచ్చి ఇంకా నీకిచ్చేదేటని పెద్ద మొత్తం ఎగేసినపుడూ, గుడిసెబాగు చేస్కునేందుకు అడవిలోంచి తెచ్చుకున్న టేకు మొద్దులు మంచి మాటల్తో కాజేసి తనమిద్దె కట్టుకోడానికి ఉపయోగించుకున్నప్పుడూ, ఇంకా చాలా సార్లప్పుడూ సింవ్వాద్రినాయుడిమీద తనకు పగే కలిగిందితప్ప మరేం లేదని వాడు తనలో తాను చాలాసార్లనుకున్నాడు. కానీ వాన్ని నేనేటి సెయ్యగల్ను? పెద్దింటి లంజికొడుకుల కెదురేటుంటాది? అనుకున్నాడు. కానీ మళ్లీ అన్నేటోఒటి సెయ్యకుండా వుండలేను అనుకున్నాడు. మరయితే ఏంచేద్దామని? మొన్నెక్కడో ఇట్టగే కష్టాలింకపడలేనుగాక పడలేనని కాసింత బూవి కౌలుకుతీసుకుని విత్తనాలేసేడు. అది బాగాఎదిగి కోతకొచ్చింది. తరుణంలో విత్తనాలేసిందగ్గర్నించీ రాత్తుర్లు, పగళ్ళనక కాపలాకాసేడు. పిట్టనికూడావాలనీకుండా కాపాడేడు. ఇంకో రెండ్రోజుల్లో కోతలు మొదలుపెట్టిద్దామనుకున్నాడు. ఆ ధాన్యంతో యీయేడు సజావుగా సాగుద్దని మురిసిపోయేడు. దానిమీదెన్నో ఆశలుపెట్టుకున్నాడు. ఇల్లు బాగుచేసుకుందామనుకున్నాడు. కొత్తబట్టలు కొందామనుకున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే సింవ్వాద్రినాయుడు దిగేడు. తానెప్పుడో యిచ్చిన అప్పు మిగిలిందంటూ లెక్కల్చూపేడు. ఆ అప్పెక్కడిదో,



ఎప్పుడు తీసుకున్నాడో తనకి అర్థంగాకపోయినా అప్పుతీసుకున్నట్టు సాక్ష్యాలు చెప్పించేడు. తానీ అప్పు తీసుకోలేదన్నాడు- దొంగ అప్పులు పుట్టించడం న్యాయంకాదన్నాడు- కనికరించమన్నాడు- ఇంకా అనాల్సినవన్నీ అన్నాడు బతిలాడేడు- అయినా వాడు విన్లేదు- ససేమిరా వీల్లేదన్నాడు- అప్పిచ్చితీరాలన్నాడు- లేపోతే బాకీ కిందకి పంట తీసేసుకుంటానన్నాడు. అలా అనేయడం, వారివెంట వచ్చిన మనుషులు పంట కోసీడం జరగడం అయిపోయింది- అప్పుడు వెంకట్రావుడికి దుఃఖంరాలే- నెల రోజులకింద సోంపేట రైతులు భూస్వామిని అడ్డంగా నరికీసి వాడి భూముల్ని పంటల్ని లాక్కోడం గుర్తొచ్చింది, ఆ తరవాత వాడు రెండ్రోజుల్దాకా కన్పించలే- ఆ తర్వాత సింవ్వాద్రినాయుడు శవం వాడిముంగిట్లోనే రెండుముక్కలై కన్పించింది- ఆ తరవాత ఆ ప్రాంతంలో అట్లాటి సింవ్వాద్రినాయుళ్ళ శవాలు రెండు ముక్కలై చాలాసార్లు కన్పించేయి.

## ప్రజాసాహిత్యం - పాట

వర్గీస్

ప్రజలు-కళలు: అంటే; విశేషప్రజా బాహుళ్యం. ప్రజల సమస్త సాహిత్యం-కళలు. ప్రజల వునికిని పరిశీలిద్దామా? లేదు! ప్రస్తుతం కళలగురించి మాత్రమే చర్చిస్తున్నాం కాబట్టి ప్రజాజీవితంతో ముడివడి ఉన్న కళలను మాత్రమే చర్చిద్దాం. సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న మన కామ్రేడ్స్ ఐన రచయితలు, కళాకారులు సృష్టించిన కళలగురించిగాని సాహిత్యం గురించిగాని చర్చించడంకూడ ఈ వ్యాసం ఉద్దేశంకాదు. ప్రజలు-ప్రజల కళలు, అందునా సమస్త ప్రజాకళలలో ప్రాముఖ్యం వహించే ప్రజల పాట గురించి చర్చించడం మాత్రమే ఈ వ్యాసంయొక్క పరిధి. ఇది దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాసాన్ని చదువవలసిందిగా కోరుతున్నాను.

పాట ఎలాపుట్టింది? ప్రజలు పాటలు ఎందుకు పాడుకుంటారు? ఇది సమస్త శ్రమజీవుల జీవితాలల్లో ఎందుకు ముఖ్యపాత్ర వహిస్తుంది? నేడు ఈ రకమైన కళారూపాల గురించి ఇంత తీవ్రమైన చర్చలు జరపడం ఎందుచేత?-ఇవన్నీ ప్రశ్నలయితె సమాధానాలు కూడ గొలుసులా ఒకదానికి మరొకటి సంబంధం ఉండే వస్తాయి.

'పాట ఎలాపుట్టింది?' అన్న సమస్యనే తీసుకున్నప్పుడు ప్రజల సామాజిక జీవితాన్ని మినహాయించి దీన్ని ఊహించలేము. అందుచేత ప్రజల జీవితాలలో, సంఘర్షణలలో కష్టసుఖాలలో భాగంగానే దీన్ని చూడాలి. అప్పుడేకాని మనం సరైన నిర్ణయాలకు రాలేము.

మనిషి ఏదైనా ఎత్తేప్పుడు, లేక గడ్డపారతో (పలుగు) తొవ్వేప్పుడు అతనికి తెలియకుండానే అతని నోటినుండి (అచర్య ప్రభావంచే) ఒక విధమైన శబ్దం వస్తుంది. ఉదా: పల్లకి మోసేప్పుడుగాని, లేక ఇంకేదైన బరువైన వస్తువు మోసుకవెడుతున్నప్పుడుగాని బుజాలపై బరువుచే, కాలుతీసి మళ్ళీ ముందుకు వేసి నడుస్తున్నప్పుడు ఆశ్రమ జీవుల నోళ్ళనుండి హ(...హ(... అనే లయబద్ధమైన శబ్దం వస్తుంది. మోస్తున్న ఆశ్రమను మర్చిపోవడానికి వాళ్ళు ఆ-హ(... శబ్దాన్ని కాస్త పెంచి హో(...హో(... గామార్చు కుంటారు. అదే శబ్దం హై...హై... గా తర్వాత హైలెసాగా మారుతుంది. అదే మనం పాట అనిగాని, మరోకళ అనిగాని చెప్పుకునే ప్రజా కళలకుమూలం. అంతే ఆకాశంలోంచిగాని; అగాధంలోంచి గాని ఈ పాట పుట్టలేదని పై పరిశీలనతో గమనిస్తే మనకు సులభంగానే బోధపడుతుంది.

ముఖ్యంగా మనదేశంలో విశాల జనాభ కలిగిఉన్న పల్లెపట్టుల్లో పరిశీలిస్తే మనకు ఏమిటి గోచరిస్తున్నది? మనిషి పుట్టింది మొదలు, చచ్చేవరకు ప్రజల జీవితాలలో ఈ పాట ఒక ముఖ్యపాత్ర వహిస్తుంది. ఈ మాట ఎందుచేత అంటున్నానంటే, పాప పుట్టగానే ఏడుస్తుంది. తల్లి జోకొడుతూ-ఉ(చ్.... ఉ(చ్ ... ఉ(చ్ .. అనేదే ఒక లయబద్ధంగా ఉంటుంది. ఆ తర్వాత పురుడుపోసేప్పుడు గంతులువేస్తూ పాటపాడ్తారు. తర్వాత జోల వగైరా- ఇలా మానవ జీవితం ఆరంభంలోనే మొదలైన పాట జీవితమంతా సహచరంచేసి, ఆఖరకు చావుకు ఏడ్చేప్పుడు (గ్రామాలలో) కూడా ఆ యేడ్పు రాగయుక్తంగానే వినిపిస్తుంది. అలానే చిన్నప్పుడు చెప్పే పాట ఒకటి ఉన్నది.

"రుంగు రుంగు బిల్ల - రూపాయి దండ
దండగాదురా - దాశన్న మొగ్గ
మొగ్గ గాదురా - మోదుగు నీడ..."

తల్లి బిడ్డలకు మాటలు నేర్పడం, లేక ఆ మూగ పాపలతో మాట్లాడటం పై చరణాలతోనే మొదలౌతది. అందులోని జీవం, కవిత చూస్తే- నిజంగానే గొప్పగా ఉంటుంది. ప్రజలు, వాళ్ళకు కావలసిన వస్తువుకు అనుగుణ్యంగా స్వయంగా వాళ్ళే కవిత రూపొందించుకుంటారు. దీన్ని పరిశీలిస్తే ప్రజలలోని కళాత్మక భావం, వస్తు శక్తి ప్రదర్శితమౌతుంది,

వీధిలో చిన్నపిల్లలు ఒకల అంగీలు(చొక్కా) ఒకలు పట్టుకొని, రైలుబండిలా కదులుతూ ఆడుతూ ఉంటారు. ఒక కుర్రాడు ప్రత్యేకంగా ఆ చైనులోని చివరివాళ్ళని జొట్ చేయడానికి ఉరుకుతూ-



ఒకడు : "గొరగొర పులుసు తాగుతా !
అందరూ : ఎవ్వని సొమ్మంట తాగుతవ్ !"

ఇలా సాగుతుంది వారి ఆట. పాటతో మేళవించిన ఆట అది. ఇలా పరిశీలిస్తూ పోతే అడుగడుగునా కోకొల్లలుగా మనకు ఉదహరణలు లభిస్తాయి.

గ్రామాలలో సర్వ సాధారణంగా పాటలకువాడే వాయిద్యం డప్పు (తప్పెట) కొన్ని సందర్భాలలో కొమ్ము. గ్రామాలలో పాడే ప్రతిపాట డప్పుపై శృతి కలిసేదిగా ఉంటుంది. ఏది ఉన్నా లేకున్నా ఈ డప్పు అనేది పాటలకు తప్పనిసరిగా ఉండవల్సిన వాయిద్యం, అలాగే రకరకాలైన ఇతర రూపాలకు తబ్లా, దోలక్, సొన్నాయి, పీకె, చిరుతలు, పిల్లనగోవి, జమిడికె, బుర్రలు, ఎక్తార్, అందెలు, గజ్జెలు మొదలగునవి వాడుతారు.

ఈ వాయిద్యాలన్నింటిలో వినసొంపైనది, పొదుపైనది డప్పు ఒక్కటే. దానికి కొన్ని సందర్భాలలో కొమ్ము జతచేస్తే చాలా బాగుంటుంది. ఇవి ప్రజాకళాకారులకు మంచి ఆయుధాలు, ప్రతి ఊర్లో, ప్రతి గూడెంలో ఇవ్వి దొరుకుతాయి.

ఇక పాటల విషయానికొస్తే- తెలంగాణలో ప్రజలు పాడుకునే పాటలలో అమర వీరుడు రాజిరెడ్డిపై యీ దిగువ పాట ప్రచారంలో ఉన్నది. ఈ పాటను స్త్రీలు నాట్ల సమయంలో, కలుపు సమయంలో పనిచేస్తూ పాడుకుంటారు. కాబట్టి దీన్ని కలుపు పాట అనవచ్చు. దాన్ని యధాతధంగా ఈ దిగువన యిస్తున్నాను.

"కాలుకు బేడియుండె - కంట్రోలు బియ్యముండె
కాలమాయి పోతున్నాడె - రాజారెడ్డి ॥కాలు॥
సేతికి గడియారాము - సంకాన రేడియుండె
సైకిలెక్కి పోతున్నాడే - రాజారెడ్డి ॥సేతి॥
అడ మైలారంకాడ - గనుడే మా రాజిరెడ్డి
అంతురాన పానమిడిశె - మందిభూమికి ॥అడ॥
మూడైల కట్టెపాద - మూడైల కట్టెపాద
మురుసుకుంట పోతున్నాడే - రాజారెడ్డి ॥అడ॥
ఐదైల కట్టెపాద - ఐదైల కట్టెపాద
అడుకుంట పోతున్నాడే - రాజారెడ్డి ॥అడ॥
ఏడెయిల కట్టెపాద - ఏడెయిల కట్టెపాద
ఏడ్చుకుంట పోతున్నాడే - రాజారెడ్డి ॥అడ॥

పాడైల కట్టెపాద - పాడైల కట్టెపాద
పాడుకుంట పోతున్నాడే - రాజారెడ్డి" ॥ఆడ॥

ప్రజలు పాడుకునే ఈ జానపద గీతాన్ని గమనిస్తే మనకు నాల్గు విషయాలు బోధపడ్తాయి.

1. దరువు (పల్లవి) ప్రతి రెండు చరణాలకు పునరావృత్తి (Refrain) ఔతుంది.

2. సామాజిక సంఘటనలలో ఏదో ఒకదాన్ని వస్తువుగా తీసుకొని కవితగా మలచ బడ్తుంది.

3. పాటలో వర్ణన (ఆవిషయానికి చెందినది) ఎక్కువ ఉంటుంది. చాలా వాట్లో పాటంతా ఆ వర్ణనకే పరిమితమౌతుంది. ఉదా:

" మూడైల కట్టెపాద... "
" ఐదైల కట్టెపాద... "
" ఏడైల కట్టెపాద... "
" పదైల కట్టెపాద... "

ఇలా సాగుతుంది. ఆ చెప్పే విషయాన్ని ఇంకా గట్టి పర్చడానికి ఇలా ఔప్రెస్ చేసి పదేపదే చెప్పే పద్ధతిని అవలంబిస్తారు. అలాగే ఆ కవితా తన్మయత్వంలో పడి ఒక్కోసారి వాళ్ళు ఎంచుకున్న వస్తువుకు ఎంత దెబ్బ కల్గిస్తున్నదీకూడా గమనించరు.

4. ఈ పాట ఇంకోగ్రామ ప్రజల నోళ్ళలో పడేవరకు రూపాంతరం చెందుతుంది. అలాగే ఒక్కోసారి దరువేమారి పోతుంది. లేక చెప్పే విషయమే (Subject) మారిపోవచ్చు.

ఏ ప్రాంతంలో గమనించినా, సర్వసాధారణంగా ప్రజలు పాడుకునే జానపద పాటలు పై నాలుగు లక్షణాలు కల్గిఉంటాయ్ పైవాటిని పూర్తిగా అర్థం చేసుకుంటే గాని జానపద సాహిత్యాన్ని, మన విప్లవ భావాలకు సరిగ్గా అన్వయించుకోలేము. లేదా చక్కగా కత్తిలా ఉపయోగించుకోలేము.

అలాగే పై నాల్గు లక్షణాలతోపాటు మనం చేయవల్సిన ఐదు కర్తవ్యాలుఏమిటో చూద్దాం:

మనం ఎంచుకునే వస్తువునుగురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. వస్తువు గురించి నామమాత్రంగా తెలియడం ఎంతమాత్రమూ ఆరోగ్యకరంకాదు. మనం రాయదల్చుకున్న వస్తువును గురించి కృషిసల్పాలి. ఆ వస్తువుకు సంబంధించినవిషయాలు



సాధ్యమైనన్ని సేకరించాలి. ఇవన్నీ మనకు ఒక్కపాటలోనే ఉపయోగపడకపోవచ్చు. కాని మన రచనా వ్యాసంగానికి ఎక్కడో అక్కడ తోడ్పడతాయి. ఇలా చేయడం మన మొదటి కర్తవ్యం.

జీవితంలోలాగానే, అన్ని ఇతరకళలలోలాగానే పాటలలోకూడా దుఃఖ వీర్యాది రసాలు ఉంటాయి. వస్తువునుబట్టి వీటిని ఎన్నుకొని, ఆ రకమైన దరువులు ఎంచుకొనుట మన రెండవ కర్తవ్యం.

రాయటంలో మెలుకువ, సాహిత్యరంగంలో పనిచేస్తున్న మన కామ్రేడ్స్‌కు ఈ దరువులు ఒక మానాన పట్టుబడవు. ఎంత జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఒకచోట దరువు విరిగిపోతుంది. రచయిత యీ దరువును సరైన పద్ధతిలో నాలికపై ఆడించగల్గాలి. అప్పుడుగాని పాట సరిగ్గా రాయలేడు. ఈ నేర్పరి తనం అలవర్చుకోవడం చాలా ముఖ్యం. దీన్ని క్రమంగా అభివృద్ధి చేసుకోవాలి. లేకపోతే మన సాహిత్యం మన ఇళ్ళలోని చూర్లలో పెట్టుకోవల్సిందే. ఇది మన మూడవ కర్తవ్యం.

అలాగే జానపద గేయాలను యథాతథంగా స్వీకరించకుండా, మనకు అవసరమైన చోట మెరుగులు పెట్టాలి. అలా చేయకపోతే 'హొంతుకు దాసరి కాలాడిచ్చే' అనేలా తయారౌతాయి మన సాహిత్యం, కళలు. అంటే యాంత్రికంగా (Mechanical) ఇది మన నాల్గవ కర్తవ్యం.

పైనాల్గు చేయగల్గి మన మిడిమిడి జ్ఞానంతోఉన్న భాషనే ప్రజల భాషగా భావించి ప్రవేశపెడ్తే, మనం సృష్టించే సాహిత్యం పేలవంగా ఉంటుంది. ప్రాణంలేని శరీరంలా, అంటే శవంలా. 'ప్రజల సజీవమైన భాష'ను నేర్వడం తప్పనిసరి. ఇది మన ఐదవ కర్తవ్యం.

పైన ఉదహరించిన పాటను మన భావాలకు ఎలా మలుచుకోవాలో పరిశీలిద్దాం. పై 'రాజిరెడ్డి పాట'ను 'యథాతథం'గా సేకరిస్తే ఎలాగుంటుంది. అక్కడ రాజిరెడ్డిని ప్రజలు అమర వీరునిగా త్యాగధనునిగా కీర్తిస్తే, మనం శ్రీకాకుళ పోరాటాన్ని నడిపి, వీరోచితంగా పోరాడి నేలకొరిగిన కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణను అమర వీరునిగా చిత్రిద్దాం.

గిరిజన్ల పేదగుండె - గుప్పున మంటమండె
కాలమాయి పోతున్నాదె - సత్తెమన్న ॥గిరి॥
సేతిలా నాటుబాంబు - సంకన తుపాకుండె
నర్రి నర్రిపోతున్నాదె - సత్తెమన్న ॥సేతి॥

ఆడసీకాకులంల - గనుడే మా సత్తెమన్న
అంతురాన పానమిడిసె - విప్లవంబున ॥ఆడ॥

మూడైల కట్టెపాద - మూడైల కట్టెపాద
ముర్సుకుంట పోతున్నాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఐదైల కట్టెపాద - ఐదైల కట్టెపాద
ఆడుకుంట పోతున్నాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఏడైల కట్టెపాద - ఏడైల కట్టెపాద
ఏడ్సుకుంట పోతున్నాడె - సత్తెమన్న ॥ఆడ॥

పాడైల కట్టెపాద - పాడైల కట్టెపాద
పాడుకుంట పోతున్నాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఇలా ఉంటుంది. ఇలారాసిన దాన్నికూడా ప్రజలు స్వీకరించి పాడుకుంటారు. జనుల గుండెల్లో రాజారెడ్డి స్థానంలో సత్తెమన్న చోటుచేసుకొని, గొంతులో జీర, కళ్ళల్లో విషాదం నింపుతాడు- ఈ పాటను మనం ఇంకా మంచిగా బలంగా, కత్తిలా వాడుకోవాలి. పై పాటను attempt చేసేప్పుడు ఆ ప్రాంతీయ పాట (రాజారెడ్డి) దరువు, అక్కడి ప్రజల భాష తెలువడం మాత్రమే కాకుండా, మనం ఆపాట స్థానంలో మళ్ళీ ఏ పాటైతే (సత్తెమన్న) రాయబోతామో ఆ సబ్జెక్టుకూడా క్షుణ్ణంగా తెలిసివుండాలి అని పైననే అనుకున్నాము. మరి, ఈ 'సత్తెమన్న'పాటకై మనం సేకరించిన వస్తువుకు సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి-

శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం, పాలకొండ, పార్వతీపురం మొదలగుకొండ ప్రాంతంగల తాలూకాలు. ఆ కొండల్లో నివసించే సుమారు 2 లక్షల గిరిజనులు. వంశధార, సువర్ణముఖి మొదలగు నదులు. కొండ ప్రాంతంలో నివసించే గిరిజనుల తెగలు : సవర, జాతాపులు, కొండదొరలు.. వ్యవసాయం : పోడు- కొండలలోని చెట్లను నరికి అమితంగా శ్రమించి, పంట భూములుగామలిచిచేసేదే పోడువ్యవసాయం. పంటలు : జొన్న, గంటి, కంది, కొర్ర. అడవి ఫలసాయం : మామిడి, ఇప్ప, చింత మొ॥ మామిడి జీడి పొడిగా నూరి అంబలికాచుకొని తాగటం, గమ్మడి ఆకువండుకొని తినడం మాత్రమే వాళ్ళ ప్రధాన అహారం. వాళ్ళు పండించిన ఇతర పంటలన్నీ ఉప్పు, పొగాకు, కిరసనాయిల్ (అవ్వి మూడు మాత్రమే వాళ్ళు బయటి ప్రపంచంనుండి తెచ్చుకోవలసిన వస్తువులు) వ్యాపారంచేస్తూ కొండల్లో ప్రవేశించిన వ్యాపారస్తులు దోపిడి చేస్తున్నారు. అమితంగా శ్రమించి చెట్లనునరికి పంటభూములుగా మార్చుకున్నాక, భూస్వాములు ప్రవేశించి యుక్తితో గిరిజనులకు అప్పులిచ్చి, దాని కిందికి



భూములను లాగేసుకొని, ఆ గిరిజన-రైతులను పాలేర్లుగా (జీతగాండ్లు) కంబర్లుగా కుదుర్చుకున్నారు. ఆఖరకు అడవి ఫలసాయంమీద ఆధారపడితే వాటికికూడా అడ్డు తగిలి వివరీతంగా లంచాలు గుంజడం మొదలు పెట్టారు ఫారెస్టు ఆఫీసర్లు.

ఈ పరిస్థితుల్లో కొండబారిడి ఊర్లో స్కూలుమాస్టారుగా పనిచేస్తున్న వెంపటాపు సత్యనారాయణ, గిరిజనులను ఈ దోపిడి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సమీకరించి, గిరిజన(నీళ్ళధార)సంఘాలు నిర్మించాడు. (నీళ్ల ధారపోస్తూ సంఘంలో చేరినట్టు గిరిజనులు ప్రతిజ్ఞ చేస్తారు- అందుచేత వాటికి నీళ్ళధార సంఘాలు అనిపేరు వచ్చింది.) ఆదిభట్ల కైలాసంతో కలిసి ఈ పోరాటాన్ని, తీవ్రతరం చేశాడు. ఈయనను(సత్యం)పెద్దపులి (భూస్వాముల బుగతోల్లపట్ల)గా ప్రజలు పిలిచేవారు. ఆ నాయకుడు నడిపిన ఉద్యమం నక్సల్‌బరి ఉత్తేజంతో సాయుధ పోరాట రూపం తీసుకోవడం, ఆ పోరాటాన్ని వీరోచితంగానడిపి. పోరాటంలో నేలకొరిగిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటనాయకుడే కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ (సత్తెమన్న)

పై అవగాహనతో వస్తువుకు సంబంధించిన విషయసేకరణతో 'రాజిరెడ్డి'పాటను 'సత్తెమన్న'పాటగా ఎలా రూపొందించగలమో చూద్దాం.

ఆడ సీకాకులంల - గనుడే మా సత్తెమన్న
అంతురాన పానమిడిసె - విప్లవంబున
కొండబారిడూర్ల - ముత్తెం మా సత్తెమన్న
కొర్వి అయ్యి మండినాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఊరూరి దొర్కోల్లకు - ఉక్కుపిండము అయ్యి
ఉర్మి ఉర్మి చూసినాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఊరూరి పెద్దలకు - పెద్ద గండము అయ్యి
పెద్దపులి అయ్యినాడె - సత్తెమన్న ॥ఆడ॥

కైలాసంతోని కలిసి - కమ్టీలు యెన్నోగట్టి
గిరిజనూల పెద్దెఅయ్యె - సత్తెమన్న ॥ఆడ॥

నీళ్ళధారల సంగం - దోరోల్ల పానగండం
బుగతలను తరిమినాడె - సత్తెమన్న ॥ఆడ॥

ఆకు అలములుదిని - జీడి అంబాలిదాగి
గిరిజనుల నడిపినాడె - సత్తెమన్న ॥ఆడ॥

జాతాపు, సవరలకు - సక్కంగ దోస్తిగల్పి
సర్కారుతొ పోరినాడె - సత్తెమన్న ॥ఆడ॥

గిరిజన్ల పేదగుండె - గుప్పున మంటమండె
కదనమందు దూకినాడె - సత్తెమన్న ॥ఆడ॥
సేతిలో నాటుబాంబు - సంకన తుపాకుండె
పోరునందు వొరిగినాడె - సత్తెమన్న ॥ఆడ॥

మనం ఈపై జాగ్రత్తలు అన్నీ తీసుకొని పై పాటను రూపొందించినప్పటికి, ఈ పాటలో ప్రజల భాషకు, దరువుకు సంబంధించిన లోపాలు ఇంకనూ మిగిలి ఉండవచ్చు ఉంటాయికూడ. మరి మనం ఈ లోపాలను సవరించు కోవడం ఎలా ? ఎక్కువసార్లు ప్రజలలోకి పోవడంద్వారా, ప్రజలలో పనిచేయడం దార్వా, ప్రజల భాషను, జీవిత విధానాల్ని మరింతబాగా అవగాసహ చేసుకోవడం ద్వారానే మనం మన సాహిత్య, కళల్ని సంస్కరించు కోగల్గుతాం. ప్రజల జీవితానికి, విధానాలకు ఇంకా దగ్గరగా వెళ్ళగల్గుతాం. ఎప్పడికప్పుడు ప్రజల జీవితాలకు అణుగుణ్యంగా, సరైన మార్క్సిస్టు రాజకీయ దృక్పథంతో, మార్పులు కూర్పులు చేసుకొని ప్రజాకళలు అనే ఆయుధాన్ని మరింతా వాడిగానూ వేడిగానూ ఉపయోగించుకోగల్గుతాం.

రచయితలైన కొంతమంది మన కామ్రేడ్స్ ఏమని వాదిస్తారంటే "మేం ప్రజల దరువులు తీసుకోం, స్వతహగా కొత్త దరువుల్ని సృష్టిస్తాం- పూర్తిగా ప్రజల భాష వాడడంకూడా ఎంతవరకు సబబు. మనంకాస్త సాహిత్యపరమైనభాషనే వాడాలి"అలాగే వీళ్ళు వీళ్ళరచనలను ప్రజల జీవితాలకు, జీవిత విధానాలకు దగ్గరగా ఉండేట్టు సవరించు కోవడానికికూడ ఒప్పుకోరు. దీని అర్థం: వీళ్ళు సమిష్టి ఆలోచనా విధానాన్ని పరోక్షంగా వ్యతిరేకిస్తారన్న మాట. అంటే వ్యష్టి (వ్యక్తి). స్వీయమానసిక ధోరణిలో పడిపోతారు పాతసమాజం భావాలు వాళ్ళపై ఇంకా బలంగానే పనిచేస్తూ ఉంటాయి. ఇలాంటి వాళ్ళ గురించే చైర్మన్ మావో తన యెనాన్ ప్రసంగాలలో ఏం చెప్పాడో చూద్దాం :

"చాలా మంది రచయితలూ, కళాకారులు ప్రజలకు ఎడంగా ఉండటం వల్లా, దొల్లగా జీవించటంవల్ల, వారికి ప్రజల భాషతో పరిచయంలేదు, ఆ కారణంగా వారి రచనలలోని భాష చప్పగా ఉండటమేకాక, వారు స్వయంగా సృష్టించుకున్న విలక్షణమైన నుడికారాలు ప్రజల నుడికారాలకు విరుద్ధంగాకూడ ఉంటాయి"

"మీకు ప్రజల భాషే చాలావరకు అవగాహన కానప్పుడు, మీరు సాహిత్య సృష్టి గురించి ఎలా మాట్లాడగలరు ? "తన ప్రతాపం ప్రదర్శించే అవకాశంలేని వీరుడు" అంటే మీరుపోగుచేసిన మహత్తర సత్యాలు ప్రజలకు అవగాహన కావన్నమాట."

మన రచయితలు, కళాకారులు ప్రజల భాష, నుడికారం, దరువులు, సామెతలు మొదలగునవి నేర్చుకోవడానికి ఏంచెయ్యాలి, ప్రతి రచయిత, కళాకారుడు ప్రజల వద్దకు



వెళ్ళినప్పుడు ఒక నోట్ బుక్, పెన్ దగ్గర ఉంచుకోవాలి. వాళ్ళతో (ప్రజల) మాట్లాడుతూనే, వాళ్ళు మాట్లాడే భాష తీరు జ్ఞాపకం ఉంచుకోవాలి. అలాగే మన note book లో వడివడిగా రాసుకోవడం అలవాటు చేసుకోవాలి; వాళ్ళ జీవిత విషయాల్ని నాలుగు కోణాల్నుండి తెలుసుకొని గ్రంధస్తం చేయాలి, కళాకారులు (నటులు, చిత్రాకారులు మొ॥) వారి హావభావాలను, చేష్టలను నిశితంగా గమనించాలి. సాధ్యమైనన్ని పాటలు పాడించుకొని యధాతథంగా రాసుకోవాలి. వాళ్ళు పాడుతున్నప్పుడు ఆ దరువులను బాగా మనసుకు ఎక్కించుకొని, పదేపదే వాటినిద్యానిస్తూ ఆ దరువులు నేర్చుకోవాలి. అలారాసుకున్న వాటిని పదేపదే చదువటంద్వారా, జీర్ణించు కోవడంద్వారా మనం మన భావాలతో (రాజకీయాలతో) కూడిన పాటలు రాసుకోవడానికి ఉపయోగపడడమే కాకుండా, ప్రజల భాష, నుడికారం మనకు పట్టుబడుతుంది. ఈ రకమైన కృషి ఎంత ఎక్కువగాచేస్తే, అంత ఎక్కువగా మనం ప్రజలభాష నేర్చుకున్నవాళ్ళవుతాము. అందుమూలంగా ప్రజలలోకి మనం ఇంకా బలంగా వెళ్ళగల్గుతాము.

మరి మనం ప్రజలు అనే విశాలమైన పదం పాడుతున్నప్పుడు, వాళ్ళ కోసం మాత్రమే మన సమస్త సారస్వతం కళలూ అనుకున్నప్పుడు- ఆ ప్రజలు ఎవరు ? అనే సమస్య- దానికి చైర్మన్ మావో ఇలా విశదీకరించాడు. గ్రామికులకొరకు, కర్షకులకొరకు, సాయుధ విప్లవ శ్రేణులకొరకు ఆఖరకు నగరాలలోని పెటీబూర్జువాల కొరకు, పెటీ బూర్జువా మేధావులకొరకు-

అలాగే మనం మన సాహిత్య కళాసృష్టిచేసేముందు ముఖ్యంగా ఎక్కడెక్కడ, ఎవరెవర్ని అధ్యయనంచేయాలి. గ్రామ సీమల్లోని పాటలు అంటే రైతుకూలీలు పాడుకునే మోటపాటలు, మంచెకావలి పాటలు, కలుపు పాటలు, దండుపాటలు, పసుల కాపరి పాటలు, జీతగాళ్ళు పాడుకునే పాటలు మొదలగునవి. అలాగే బస్తీల, నగరాలలమాటకువస్తే వొడ్డెరోళ్ళ గురించి, బెస్తవాళ్ళ గురించి, హమాలీలగురించి, రైల్వే కార్మికుల గురించి, ఫ్యాక్టరీ, వర్క్‌షాప్ కార్మికుల గురించి గనికార్మికుల గురించి రిక్షా వాళ్ళ గురించి, టాంగావాళ్ళ గురించి, తాపీ పనివాళ్ళు మొదలగువాళ్ళ గురించి తెలుసుకొని, వాళ్ళలో తిరిగి, వాళ్ళ బాధలను గాధలను, దోపిడి తీరుతెన్నులను, జీవిత విధానాలను క్షుణ్ణంగా అధ్యయనంచేసి, వాళ్ళ బాషతో ఉట్టిపడుతున్న సాహిత్యాన్ని కళలను సృష్టించాలి. అప్పుడే అవ్వి సజీవంగా ఉండగల్గుతాయ్. నాలుగు కాలాలపాటు ప్రజల నాలుకలపై మనగల్గుతాయ్.

వివిధరకాల జీవితాలు గడుపుతున్న ప్రజలు అందరూ ఈ అర్థఫ్యూడల్ వ్యవస్థలో దుర్భర జీవితాలనే గడుపుతున్నారు. వాళ్ళ బాధలు గాధలు అనంతం. ఐతే మనం ప్రజల జీవిత విధానాల గురించి అధ్యయనం ఎలా కొనసాగించాలి ?

ఈ భూస్వామ్య వ్యవస్థలో రెండుచేతులా మూడుపూటలు కూలిచేసినా జానెడు పొట్ట నిండదు. ఇక సంసారాన్ని నడిపే సంగతి ఎలా ఆలోచించగలము. గ్రామంలో జీతగాళ్ళులేక కూలీలుగా పనిచేసేవాళ్ల తమ కుటుంబంతో ఒక చిన్న గుడిశెలో జీవితం వెళ్ళబుచ్చుతూ ఉంటారు. తండ్రి (ఇంటిపెద్ద)ఏ జీతగానిగానో లేక కూలివానిలాగానో భూస్వాములవద్ద కుదురుతాడు. తెలంగాణలోని పరిస్థితినే గమనిస్తే సర్వసాధారణంగా జీతగానికి నెలకు 30 రూ. జీతంకన్నా ఎక్కువ ముట్టదు. అలాగే శ్రామిక జనంలో స్త్రీలుకూడా ఉత్పత్తిలో పాల్గొంటారు కాబట్టి, కైకిలి(కూలి)దొరికీ దొరుకక మొత్తం నెలపైన ఆమె సంపాదన 20 రూ. అనుకుందాం! భార్యాభర్తలు కలిసి నెలకు 50 రూ. సంపాదిస్తున్నారన్నమాట. ఐతే ఇంట్లో పనిచెయ్యలేని ఒక ముసలోడో, ముసల్దో తప్పక ఉంటారు. అలాగే ముగ్గురు, నలుగురు పిల్లలు. సరే మొత్తం ఐదుగురే అనుకుందాం. ఆ ఇంటి సంపాదన నెలకు రూ 50 ఐనప్పుడు ప్రతి మనిషికి నెలకు సగటున రూ. 10 వస్తాయి. అంటే రోజుకు 33 పైసలు, పూటకు 16 పైసలు (నయా పైసలు) ఆ ఇంట్లో ప్రతి మనిషి పూటకు 16 పైసల తిండి(భోజనం)తింటాడన్నమాట. ఆ 16 పైసలతో మన శ్రీమాన్ ప్రభుత్వంవారు రోజూ రేడియోలో సెలవిచ్చేట్టు. గుడ్లు, పండ్లు, మాంసం పప్పుదినుసులు, ఆకుకూరలు మొ॥ తింటాడా! వీటి మాట దేవుడెరుగు, ఆ 16 పైసలతో ఈ రోజుల్లో కాస్త గంజయినా దొరుకుతుందా! అన్నది సమస్యనే— అందుచేతే గ్రామాలలో యీ స్థితిలో బ్రతుకునీడుస్తున్న ప్రజల జీవితాల గురించి మన సాహిత్యకారులు, కళాకారులు అధ్యయనంచేయాలి. అందుకే ప్రతిసారి ప్రజలు, ప్రజల జీవితం, ప్రజల సజీవమైన భాషను నిరంతరం అధ్యయనం చేయమని, మన సాహిత్య కళారంగాలలో పనిచేస్తున్న మన కామ్రేడ్‌కు పదే పదే హెచ్చరిస్తాం.

ప్రజలలోకి వెళ్లాలి! ప్రజలతో కలిసి పనిచెయ్యాలి! అన్న మాటలను మనం ఎలా అర్థం చేసుకుంటాం? అంటే వీటి అర్థం; ప్రజలలో ముఖ్యంగా గ్రామీణరైతాంగంలో పనిచేయడానికి నిస్సంకోచంగా, నిష్పయంగా, హృదయపూర్వకంగావెళ్ళడమే. అలాంటి ప్రయత్నాలు కొనసాగించడంద్వారానే, 'మనం ప్రజలతో ఎలా మమేకం కావాలి!' అన్న సమస్యను పరిష్కరించుకోగల్గుతాం. వాళ్ళకు దూరంగాఉండి ఎంత మాత్రమూకాదు!

పైన వివరించినట్టు యెంతో మంది శ్రామికుల జీవితాలలో వివిధరకాలైన, మేలైన'వస్తువు' మనకు లభిస్తుంది. వాటిని సమర్థవంతంగా, సృజనాత్మకంగా, ప్రజల భాషతో, జీవిత విధానాలతో వ్యక్తపర్చడమే మన రచయితల, కళాకారుల పని.

మనం గ్రామాలలో పనిచేసే జీతగాళ్ళ(పాలేర్ల) పరిస్థితి ఎలాఉందో సూచాయగా తెలుసుకున్నాం. ఐతే వాళ్ల వాళ్ళ సంతానానికి చదువు సంధ్యలు చెప్పించగలరా? లేదు!



పూట కెళ్ళడమే గగనమైనప్పుడు ఎలాగు వాళ్ళ సంతానాన్ని చదివించలేరు, విజ్ఞానవంతుల్ని చేయనూలేరు. వారు వారి సంతానాన్ని ఏ పనులకాపరిగానో, మరో పనిలోనో నియమిస్తారు. అయితే యిలాంటి పనులు చేసే బాలుర వయస్సు ఎంత ఉంటుంది? 5 సం॥ నుండే వీళ్ళు పనిలోకి దూకుతారు. (వాళ్ళ వయసు సామాన్యంగా 5 సం॥ నుండి 12 సం॥లోపే ఉంటుంది. 12 సం॥ దాటడంతోనే వాళ్ళకోసం ఇంకా బరువైన పనులు వేచి ఉంటాయి)

ఇంకా వికసించీ వికసించని మనసుగల ఈ 'పిలగాళ్లు' అధికశాతం 'గోజలకాసే పోరగాళ్లు'గా మారిపోతారు. వీళ్ళ జీవితం ఎలా ఉంటుందో చూద్దాం. వివిధ భూస్వాములవద్ద పనిచేస్తున్న యీ పిలగాళ్లు తమతమ (భూస్వాముల) గోజలను (పశువులను) తోలుకొని గుట్టల వెంట, కంచెల వెంట తిప్పుతూ ఉంటారు. ముఖ్యంగా అడవిలో మేపుతూ దినమంతా అక్కడే గడుపుతారు. ఆ అడివి వాళ్ళ రాజ్యంగా భావిస్తారు. ప్రాణాలు చిన్నవికాబట్టి విపరీతంగా ఆకలివేస్తుంది. ఇండ్లల్లనుండి వచ్చే సద్ది, గట్క, కారం, ఇది ఎంతమాత్రమూ వీళ్ళ ఆకలి దీర్చదు. ఆనిగపుకాయ (సొరకాయ)బుర్రలో తాగడానికి తెచ్చుకున్న నీళ్లకూడా ఆపనిచేయవు. దాంతో వాళ్ళకు అడివిలో ఏదిదొరికితే దాన్నే ఆహారంగా తింటారు. అందరు వెతికి తెచ్చినవన్నీ ఒక వద్ద ఉంచి వాటిని సమంగా పంచుకొని తింటారు— బుర్కపిట్టలు కంజులు, కుందేల్లు, గువ్వలు, పావురాలు, జమ్మడికాకులు, ఉడుతలు, ఎలుకలు, ఉశిర్లు(పురుగులు) ఇవ్వి ఎవ్వీ వీళ్ళనుంచి తప్పించుకొనిపోలేవు— ఈరకమైన పక్షులను, జంతువులను, పురుగులనుసైతం వీళ్ళు ఆహారంగా తీసుకుంటారు. వాట్ని పట్టి చంపి, ఏరిన కట్టెలు కుప్పగాపోసి మంట పెడ్తారు. ఆ మంటలో వాట్ని కాల్చుకొని తింటారు. తిన్న ప్రతిసారి ఆనిగపుకాయ బుర్రలో నీళ్ల ఉండనే ఉంటాయి—

ఇవ్వేకాక ఆకులు, పళ్లు, దుంపలు ఏవీ పోనియ్యరు. దుంప గడ్డలు, యెత్తెరి గడ్డలు, శిత్రపలము ఆకు, చితుపలపూత, చితుపలకాయలు, చింతచిగురు, చింతకాయలు, చేపలు, కంకులు, పిట్టలగుడ్లు (egges)— ఇవ్వీ ఆహారమే!

ఊర్లోంచి ఒక్కొకసారి సద్ది రానేరాదు! అట్లాంటప్పుడు కేవలం వీటితోనే సరిపుచ్చుకుంటారు. ఆటలు: బడ్డిక(కబడ్డి), చిర్రగోనె, చెట్లపొంటి దాగుడు మూతలు, దున్నపోతులపై ఎక్కి స్వారి—

తప్పిదారి వీళ్ళుకాసే గోజలు మందిచేన్లో పడితే ఆ చేనువాడు వచ్చి తంతాడు. గోజలను బంజరుదొడ్లోకి కొడ్తాడు. గోజలు బంజరుదొడ్లో పడటం మూలంగా జీతం ఉంచుకున్న దొర(పటేలు)కూడా కొడ్తాడు. ఈ పిలగాళ్ళు ఇవన్నీ భరించలేక ఎటన్నా

డెంకపోతారు(పారిపోతారు). ఎక్కడున్నా పట్టుకొచ్చి మళ్ళీ పనిలో పెడతారు. ఇదీ 'పసులగాసే పోరగాళ్ళ' స్కెచ్. ఇంకా వివరంగాకూడా పరిశీలించొచ్చు. మనఅవస రాన్నిబట్టి ఈ పరిశీలనసాగాలి; పాటకైతే ఈ సమాచారం సరిపోతుంది. పైన ఉదహ రించినది ఒక చిన్న పరిశీలనమాత్రమే; దీన్ని రానురాను అభివృద్ధిచేసుకోవాలి. ఇలా మనం ప్రజల జీవితాన్ని అధ్యయనంచేయాలి. మనం ప్రజల జీవితాన్ని ఎంత తెలిసుంటె మరిన్ని జీవిత సత్యాలను మన సాహిత్య. కళలలో ప్రతిబింబించగలము. ఒక్కమాటలో పైన ఉదహరించినరీతిలో మన అధ్యయనం, తీవ్రమైనకృషి సలిపితె మన రచయితలు కళాకారులు సమస్త ప్రజాసాహిత్య కళల్ని సృష్టించగలరు-తెలంగాణ ప్రాంతంకు సంబంధించిన కొన్నిపాటలను పరిశీలిద్దాము-

"వానాగొట్టాలేదు – వరదాలెక్కడివే ॥గోగుమల్లె సీతమ్మ॥
నీ మొగడు నీలవరుడు – నిన్నొల్లడంట- „ „ "
"నా ఎడుగురన్నాలు – బాయిల్ దొవ్వంగా
॥భారతీ కీరియాల మావురారాగంగో॥
బాయి బాయికినేను – బత్కమ్మనొదు
॥బా॥ మా॥"

"ఏనియాలొ ఏనియాలొ – ఏనియాలో గోపి
సీతమ్మకథ వినరే – ఏనియాలో॥ ॥ఏని॥ "

పై మూడు దరువులు స్త్రీలు పాడుకునే కోలాటం (చప్పట్ల) పాటలవి. సాధార ణంగా ఇవ్వి వెన్నెల రాత్రులు అందరూ ఒక వద్దచేరి చప్పట్లతో పాడుకుంటూ ఉంటారు అలాగే ప్రసిద్ధ ప్రచారంలోఉన్న ఉయ్యాలపాట.

పాట: ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో
నీ మొగనిపేరేమి „

ఇది బతకమ్మ పండుగ సందర్భంగా ఆడుకూ పాడతారు.

"సింతల్లు దాటినాడు ॥నరుడో : నారాయణరెడ్డి॥
సిరుర్రిన కదిలినాడు „ „
"జిట్టిలాగు పిల్ల గాడు – సెట్టుదిగడేమీ సేతు
నిమ్మసెట్టు ఎక్కినాడు – నిమ్మవండ్లు తెంపినాడు"
"ఆశన్న ఊశన్న – అన్నదమ్ములోయ్
ఆశన్నా – ఊశన్నయ్ లాల:



ఆశన్న తలగొట్టి – అల్వదోడిరోయ్
ఆశన్న – ఊశన్నయ్ లాల:"

పై మూడు పీర్ల పండుగ సందర్భంగా ఆడే "ధూలా" నృత్య రూపకంలో పాడుకునే దరువులు.

పోశమ్మల పండుగకు పాడుకునే—
"అమ్మే కాళమ్మే – మాకాళో!
నీకు దండాలె – తల్లి మాకాళో"

కాముని పండుగకు(హోలి)పాడుకునే—
"॥ వోలీ వోలీల రంగ వోలీ – కెమ్మకేలీల వోలీ ॥
దుబ్బుర్ దుబ్బురెంటికాలు – దుద్వరాదు ముద్వరాదు."

మొదలగునవి ఎన్నో పేర్కొనవచ్చును—
అలాగే రాయలసీమలో పాడుకునే మామూలు పాటల దరువులు:
"బేట్రాయి సామిదేవుడా
వన్నేలినోడ
బేట్రాయి సామిదేవుడా"
"బాయిలో బండవడె
బక్కెద్దుమూలబడె
దాలించు నరసప్ప చెరుకుతోట!"
"సై సై చిన్నపరెడ్డి
నీ పేరేబంగారు కడ్డీ"

మొదలగునవి యెన్నో ప్రచారంలో ఉన్నాయి. ఐతే ఈ పాటలను రాసేప్పుడు, రచయి తలకు విధిగా ఆయాప్రాంతీయ జీవితం, భాష, నుడికారం తెలిసిఉండాలి. లేదా చిత్త శుద్ధితో పరిశీలన జరిపిన తర్వాతనే attempt చేయాలి. అప్పుడేగాని ఆ రచనలో జీవం ఉట్టిపడదు.

ఒక్కొక్క ప్రాంతంలో ప్రజల జీవిత విధానము దానికి అనుగుణ్యంగా ఆచార వ్యవహారాలు ఉన్నట్టే శ్రీకాకుళ ప్రాంతంలో ఒక సామూహిక నృత్యం ప్రచారంలో వున్నది. ప్రజలు డప్పుకు కట్టివున్న తాడు హారంలా మెడపై వేసుకొని, డప్పును (ఇది చిన్నదిగా ఉంటుంది)తమ గుండెలపై పరుచుకొని, దాన్ని వేళ్ళతోకొడుతూ ఆడ తారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కొండజాతి ప్రజలు పాడుకునే కొన్ని దరువులు ఇలా వుంటాయ్.

"రేరేలాయ్యో రేరేల రేల రేరేల
రేరేల రేలారే...
య్యేరేరేలయ్యో రేరేల రేలరే."

"గుడుంబాడ్ ! గుడుంబాడ్ !!"

ప్రతి చరణం తర్వాత ఈ పల్లవి పునరావృత్తి.

పైన ఉదహరించిన 'రేరేలాయ్యో...' అనే దరువును వీళ్లు విరివిగా ఉపయోగిస్తారు. రకరకాల పాటలకు ఈ దరువును రకరకాల నొక్కులు దిప్పి పాడుకుంటారు. ఈ పాటలు సామాన్యంగా ఆటతో మేళవించే ఉరోటాడ్. స్త్రీలు వెన్నెలరాత్రులు ఆడుతూ పాడుకుంటారు. డోలా, పిల్లనగ్రోవి, కంజ్రా, బౌజమ్ మొదలగు వాయిద్యాలువాడుతారు. ఇలాంటి గిరిజనులు, లేక లంబాడీలు మొదలగు తెగలు నివసించే ప్రాంతంలో వాళ్ళకు ప్రత్యేకమైనభాష ఉంటుంది కాబట్టి వాళ్ళ భాషలోనే, వాళ్ళ దరువులతోనే మన సాహిత్యం రూపొందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ఉదా: శ్రీకాకుళంకు ఒరిస్సా ఆనుకునే ఉంటుంది. శ్రీకాకుళయుద్ధ సందర్భంలో ప్రజాకవి కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి ఒరియా గిరిజనులను ఉత్తేజపరుస్తూ వాళ్ళ భాషలోనే రాసిన ఒక ప్రబోధ గీతం చరణాలు ఇలా ఉన్నాయి.

"జంఘోతడి - విస్పోముడి
వుతాహెచాసి (ఆదివాసి)
అంరు మొద్ద్యే ముడోరోఖి
కంథూనా బోసి భాయి"

పాటకు సంబంధించి కొంత చర్చించాము. ఐనా ఇది అసమగ్రమే ! మన రచయితలు, కళాకారులు మరింత విపులంగా ఈ విషయాన్ని ఇంకా బాగా అధ్యయనంచేసి ముందు ముందు మంచి చర్చలు కొనసాగిస్తారని ఆశిస్తాను.

ఆఖరుగా చెప్పే ఒక విషయంతో వ్యాసం ముగిస్తాను; "మనం సృష్టించే సారస్వతం, కళలు ప్రజల జీవితాలతో ముడివడి వున్నటువంటిదై ఉండి, భాష, చిత్రణ జీవం వుట్టిపడుతున్నటువంటిదై వుండి, సాంస్కృతిక రంగంలో అనేక విజయాలను సాధిస్తూ, మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానంపై ఆధారపడి, మార్క్సిస్టు ఆచరణతో ముడిపడి, భారతదేశ ప్రజాయుద్ధపంథాకై, ప్రజాసంస్కృతిని పెంపొందిస్తూ మరింత గట్టిగా నిలదొక్కుకోవాలి !"

# చైనాలో అభివృద్ధి నిరోధక వర్గాల గురువు కన్‌ఫ్యూషియస్

షిహ్‌హువా-సు

[చైనా చరిత్రలో వేరు వేరు కాలాల్లో అభివృద్ధి నిరోధక వర్గాలు కన్‌ఫ్యూషియస్‌మీద గొప్ప గొప్ప బిరుదులు కురిపించాయి. "సాంస్కృతిక చక్రవర్తి" "ఉత్తమోత్తమ మహర్షి" వంటివి. ఈ విధంగా ఆయనను నిజమైన చైనా ఋషిగా ప్రజలు భావించేలా వాళ్లు ఎత్తులు వేశారు. వాస్తవంలో ఆయన అభివృద్ధి నిరోధక వర్గాల 'ఋషి' మాత్రమే.]

చైనా చరిత్రలో రెండునాల్కల వాళ్లు, చైనా కమ్యూనిస్టుపార్టీలో అవకాశవాద పంథాలకు నాయకులైన 'పెద్దమనుష్యులు' కన్‌ఫ్యూషియస్‌ను పూజించారు. బూర్జువా పదవీ వ్యామోహపరుడు, కుట్రదారుడు, రెండునాల్కలమనిషి, విప్లవ విద్రోహిఅయిన లిన్‌పియావో కూడా వీరికి తీసిపోడు.

లిన్‌పియావో కన్‌ఫ్యూషియస్‌కు అర్హమైన శిష్యుడు.

ఇప్పుడు మనం కన్‌ఫ్యూషియస్ ముసుగును చీల్చి ఆయన నిజమైన రూపురేఖల్ని చూపుదాం.

బానిసల్ని పెట్టుకొనే యజమానుల ఉన్నత సంపన్న కుటుంబంలో కన్‌ఫ్యూషియస్ (551-479 క్రీ.పూ.) పుట్టాడు. అది అప్పటికి పతనావస్థలో వున్నది. చైనా బానిస సమాజంనుంచి భూస్వామ్య సమాజంలోకి మారుతున్న విప్లవాత్మకదశలో ఆయన జీవించాడు; కాని ఆయన తన జీవితమంతా పాశ్చాత్య చౌ వంశ (1100-770 క్రీ.పూ.) బానిస వ్యవస్థను పునఃస్థాపించడమే తన జీవితలక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ ఆశయం కోసం ఆయన అభివృద్ధినిరోధక కార్యక్రమాన్ని సిద్ధం చేశాడు. "నిగ్రహాన్ని అలవరచుకొని ఆచార వ్యవహారాలను కాపాడండి." అదృశ్యమైపోతున్న బానిసరాజ్యాలను పునరుద్ధరించాలని, బానిసల్ని పెట్టుకొనే శిథిలమైపోతున్న సంపన్నవర్గాల వారసత్వ విశిష్టహక్కులను నిలబెట్టాలని, అధికారం పోగొట్టుకొన్న "ఉత్తములను" తిరిగి అధికారంలోకి తేవాలని ఆయన ఆక్రోశించాడు. ఒక్కమాటలో ఆయన చరిత్రగమనాన్ని వెనక్కి తిప్పదలచుకున్నాడు. ఆయన ప్రగతిని, సంస్కరణను, బానిస తిరుగుబాట్లను వ్యతిరేకించాడు.

ఇరువై ఆరు, ఇరువైఏడేండ్ల వయసులో 'లు'రాష్ట్రంలో పశువులకు ఇన్‌చార్జ్‌గా ఒకసారి, అకౌంటెంట్‌గా ఒకసారి రెండు చిన్న ఉద్యోగాలు చేశాడు. తర్వాత తన కార్యక్రమాన్ని కొనసాగించడానికి, పాత వ్యవస్థను పునఃస్థాపించడానికి "ప్రతిభాశాలు

రకు" శిక్షణయిచ్చే ఆశతో ప్రబోధించడం ప్రారంభించాడు. సుమారు ముప్పైసంవత్సరాలవయస్సులో ఒక ప్రైవేటు బడి ప్రారంభించాడు. ఆయన శిష్యులకు ఆయనప్రబోధించిన ఆశయాలు చౌ వంశవిధానాలను తిరిగి నిలబెట్టాల్సిన ఆవశ్యకతను గురించి పరిపూర్ణ విశ్వాసం కష్టపడి చదివి జీవితాన్ని బలిపెట్టిఅయినా బానిసవిధానాన్ని యథాతథంగా కాపాడడం. ఆయనకు శిష్యుడుగా చేరాలంటే శుభ్రంచేయబడిన పందిమాంసంముక్కలు ఫీజుగా చెల్లించాలి. అంత మాంసం బానిస ఎలా కొనగలడు? ఆయన శిష్యులు అందరూ సంపన్నకుటుంబాలనుంచి వచ్చినవాళ్లే అనడానికి యీ నిదర్శనంచాలు.

బానిసల్ని కలిగివుండే సంపన్న వర్గాల మానసిక దృక్పథాన్ని కన్‌ఫ్యూషియస్ "జెన్" (మానవతాహృదయం)గా అభివర్ణించాడు ఆయన తాత్విక విధానానికి యిది కేంద్రబిందువు. ఆయన శిష్యుడు యెన్‌యువాన్ ఒకసారి "మానవతా హృదయం" అంటే ఏమిటని అడిగాడు. స్వయం నిగ్రహాన్ని ఆచరించి, చౌ వంశ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా మాటలను, ప్రవర్తనను మలచుకోవడమేనన్నది సమాధానం. ఇదిచేస్తే, అంత దయామయమైన పరిపాలనక్రిందికి వస్తారని, కన్‌ఫ్యూషియస్ గట్టిగా చెప్పాడు అంటే కన్‌ఫ్యూషియస్ ప్రబోధించిన "మానవతా హృదయం"బానిస విధాన అభివృద్ధినిరోధక పరిపాలనను పునఃస్థాపించడానికి ఉద్దేశించింది.

సంపన్నులే మానవతా హృదయం కలిగి వుంటారని, బానిసలు కలిగివుండరని కన్‌ఫ్యూషియస్ చెప్పాడు. అందువల్ల ఆయన ప్రతిపాదించిన "మానవతాహృదయం" అనేది బానిసలకు వర్తించదనేది స్పష్టం. బానిసల తిరుగుబాట్లను అణచడం కొరకు బానిస యజమానులను, పాలకవర్గాల్లోవున్న స్వేచ్ఛా మానవులను ఆకర్షించడానికి ఆయన ప్రయత్నించాడు.

కన్‌ఫ్యూషియస్‌కు 34 సంవత్సరాల వయసున్నపుడు, 'లు' రాష్ట్రానికి చెందిన చావో ప్రభువు యితర బానిస యజమాన సంపన్నులతోకలసి చిసున్ కుటుంబానికి ప్రాతినిధ్యం వహిస్తు, అప్పుడే తలెత్తుతూన్న భూస్వామ్యశక్తులను అణచివేయడానికి ప్రయత్నించాడు. యుద్ధంలో ఓడిపోయి చావో ప్రభువు 'చి' రాష్ట్రానికి పారిపోయాడు. కన్‌ఫ్యూషియస్ కూడా తన చాలా మంది శిష్యులతోపాటు పారిపోయాడు. 'చి' రాష్ట్రానికి చెందిన చింగ్ ప్రభువుకూడ తలయెత్తుతున్న భూస్వామ్యవర్గాల తాకిడికి గురియైనట్లు తెలుసుకొని, చౌ వంశ ఆచార వ్యవహారాలను నిరాకరించే శక్తులను శిక్షించడానికి దండయాత్రలు చేసి, తొలిరోజులనాటి పాశ్చాత్య చౌ వంశ "స్వర్ణయుగాన్ని" పునఃస్థాపించవలసిందిగా కన్‌ఫ్యూషియస్ అతణ్ణికోరాడు. [రాజు పాలకునివలె, ప్రజ పాలితులవలె, తండ్రి తండ్రివలె, కొడుకు కొడుకువలె నడుచుకుంటే పరం పరాగత పద్ధ



తుల్లో ఎవరిస్థానంలో వారు వుంటే బానిస విధానాన్ని కాపాడవచ్చునని రాజు కతడు చెప్పాడు.]

దాదాపు అదేసమయంలో, సిన్‌రాష్ట్రానికి చెందిన ఒక ఉన్నతాధికారి ఒక శాసన ఫలకాన్ని అందరూ చదివేవిధంగా స్థాపింపజేశాడు. ఆర్థిక పునాదుల్లో వచ్చిన మార్పు ఉపరితలంలో తెచ్చిన మార్పును ఇదే సూచిస్తుంది. [బానిస యాజమాన్య సంపన్నవర్గ పోటమికీ తలయెత్తుతున్న భూస్వామ్య శక్తుల విజయానికీ యిది సూచన ఆ కాలానికి ప్రగతిదాయకమైన యీ చర్య కన్‌ఫ్యూషియస్‌కు క్రోధకారణమయింది.] చౌ ప్రభువు కాలంలో నీచవర్గాల మనుష్యులకు ఆచార వ్యవహారాలు వ్యాపించేవికావు. సంపన్నవర్గాల వారికి శిక్షలు విధించబడేవికావు. ప్రాచీనులు ఆలోచించిన వ్యవస్థను సిన్ రాష్ట్రం త్రోసిపుచ్చింది. అంతేకాదు, శిక్షాచట్టాన్ని బహిరంగంగా ప్రకటించింది బానిసలు యీ ఫలకంనుంచి దీనిగురించి తెలుసుకుంటారంటే తెలుసుకోరామరి? సంపన్నుల ఆజ్ఞలను శిరసావహించరా అంటే శిరసావహిస్తారామరి? అటువంటప్పుడు సంపన్నులకు, తక్కువవారికి తేడాచూపే వ్యవస్థ యెక్కడుంటుంది యింక? సిన్ రాష్ట్రం నాశనమైపోవడం నాకళ్ళముందే జరుగుతుంది. అని కన్‌ఫ్యూషియస్ ఒక శిష్యునిచేయిపట్టుకుని 'శోకాడించాడు'. "బానిస వ్యవస్థకు సంబంధించిన ఆచార వ్యవహారాలు, పరిపాలన" అనేదాన్ని ఎంత పట్టుదలగా, మొండిగా కన్‌ఫ్యూషియస్ సమర్థించాడో ఈ ఆక్రోశమే నిరూపిస్తుంది.

52 ఏళ్లు దాటాక కన్‌ఫ్యూషియస్ 'లు' రాష్ట్రానికి యాక్టింగ్ ప్రధానమంత్రి అయ్యాడు. ఆ కాలంలో షావో చెంగ్ మావో అనేఆయన సంస్కరణలను ప్రబోధించి బలపరచాడు. ఎప్పుడూ 'మానవతా హృదయం'గురించి ప్రగల్భాలు పలికిన వంచకుడయిన కన్‌ఫ్యూషియస్ యీ ప్రముఖ సంస్కరణవాదిని కల్పిత నేరాలు ఆరోపించి ఉరితీయించాడు. అయినా కన్‌ఫ్యూషియస్ అధికారం చాలాకాలం నిలబెట్టుకోలేకపోయాడు. మూడు నెలల తర్వాత అతడు బర్తరఫ్ అయ్యాడు. తర్వాత కాలంలో ఆయనా, ఆయన శిష్యులు ఒకచోటినుండి మరోచోటికి అభివృద్ధినిరోధక రాజకీయ ఆలోచనలను ప్రచారంచేస్తూ తిరిగారు. కాని కాలం మారింది. చరిత్ర ముందుకు సాగుతున్నది. ఆయన ఎక్కడికి వెళ్ళినా చుక్కెదురే అయింది. కొన్ని రాష్ట్రాల పరిపాలకులు ఇతన్ని "PERJONA HON GRATA" (నమ్మతగని వ్యక్తి)గా ప్రకటించారు. వియ్ రాష్ట్రంలో ఎంతోమందితో రాజుకు తనగురించి సిఫారసు చేయించుకున్నాడు కాని రాజు అతన్ని లక్ష్యపెట్టలేదు. 'చు' రాష్ట్రానికివెళ్తే మొదట చావో రాజు యితనికో ఉద్యోగ మిద్దామనుకున్నాడు. "కన్‌ఫ్యూషియస్ చౌ వంశరాజుల అడుగుజాడలలో నడువదల్చుకున్నాడు"అని అతని ముఖ్యమంత్రి జూసి అతన్ని హెచ్చరించాడు. "చౌ కుటుంబం

మనకిచ్చిన సుంకము వెచ్చై లిలప్రాంతం మాత్రమే. నీవతన్ని వుద్యోగంలోకి తీసుకున్నావంటే నీ రానున్నతరాలకు శాంతి వుండదు" అని హెచ్చరించాడు. చౌ రాజు కన్‌ఫ్యూషియస్‌కు వుద్యోగమిచ్చే ఆలోచన విరమించుకున్నాడు. జీవితకాలమంతా కన్‌ఫ్యూషియస్‌ను సామాన్య ప్రజలు అసహ్యించుకున్నారు. తనకసాధ్యమని తెలిసినదాన్ని సాధించడానికి ప్రయత్నించిన మనిషిగా యితన్ని 'లు' రాష్ట్రానికి చెందిన ఒక నగరం ద్వారపాలకుడు వర్ణించాడు. చెంగ్ రాష్ట్రంలో ఎవరో యితడు దిక్కులేని కుక్కలాగున్నాడని వర్ణించాడు.

కన్‌ఫ్యూషియస్ ప్రయాణాలుచేస్తున్న సందర్భంలో ఒకరోజు ఆయన శిష్యుడు జులు వెనుకబడిపోయాడు. ఒక వెదురుగంప ఎత్తుకొని ఎదురుగా వస్తున్న ఒక ముసలాయనను "మా గురువుగారిని చూశావా?" అని అడిగాడు. "నీ గురువా? ఆయన కాళ్లు చేతులు ఎప్పుడూ కష్టం చేయవు. ఐదురకాల ధాన్యాలమధ్య తేడా ఏమిటోకూడ తెలియదు. అతనిగురించేనా 'నువ్వడిగేది?" అన్నాడా మనిషి.

కన్‌ఫ్యూషియస్ మానవశ్రమను చులకనగా చూశాడు. కష్టజీవులను నీచులుగా భావించాడు. కష్టజీవులు కొన్ని శతాబ్దాల తరబడి అతన్ని చులకనగా, అవహేళన దృష్టితో చూశారు. అతన్ని వ్యతిరేకించారు.

ఒకసారి చి, లు రాష్ట్రాల సరిహద్దుల్లో లిసియా చిహ్ నాయకత్వంలో పెద్ద బానిసల తిరుగుబాటు వచ్చింది. ఎన్నో రాష్ట్రాల పాలకులు భయపడిపోయారు. ఈ తిరుగుబాటు నాయకున్ని మధ్యవచ్చి నాశనంచేసి యీ-తిరుగుబాటును అణచివేయాలని కన్‌ఫ్యూషియస్ పండ్లుకొరుకుతూ నిశ్చయించుకున్నాడు. ఇద్దరు శిష్యులను తీసుకుని లిసియా చిహ్ వద్దకు వెళ్ళి నేర్పుగా అతనితో "నువ్వు ఆయుధాలుదించి, నీ మనుష్యులను వుపసంహరిస్తే, నీకొక పెద్ద నగరం వచ్చేలా చేస్తాను. అపారమైన సంపదలు అనుభవిస్తూ నువ్వొక ప్రభువులా జీవించవచ్చు" అని ఆశ చూపాడు. పాత వ్యవస్థను పునఃస్థాపించడానికి పూనుకున్న మూర్ఖుడని కన్‌ఫ్యూషియస్ గురించి లిసియా చిహ్‌కు తెలుసు. అతడు చాల కోపంగా యితని అభివృద్ధినిరోధక కార్యక్రమాన్ని తిరస్కరించాడు.

బానిస యాజమాన్య సంపన్నవర్గాల్లో వుండే నిరంకుశ విధానాన్ని, బానిస విధానంలోవుండే అసమానతలనూ బట్టబయలుచేశాయి. కన్‌ఫ్యూషియస్‌ను వంచకుడని, పరాన్నజీవి అని, జీవితంలో సంపదలు ఉన్నతపదవులు, సంపదలు సాధించుకోవడమే లక్ష్యంగాపెట్టుకొని తన కొంతెనాలుకతో ఎప్పుడూ కష్టాలు సృష్టిస్తూ, దోపిడీదారుగా, నిరంకుశాధికారిగా ప్రజలను అణచివేసినవాడని ఇతడు విమర్శించాడు. కన్‌ఫ్యూషియస్ నిరుత్తరుడయి గెంటివేయబడ్డాడు. తురాయి పడిపోయినవానివలె తనబండిలోకి తిరిగి వచ్చాడు. మొహం వెలవెలబోయింది. ఇల్లుచేరేవరకు మూడుసార్లు అతని వణకుతున్న



చేతిలోనుంచి కళ్ళాలు జారిపోయాయి. అంతగా అవమానం అనుభవించాడు కన్‌ఫ్యూషియస్.

ఒక రాష్ట్రంనుంచి మరో రాష్ట్రానికి ప్రయాణాలుచేసిన పద్నాలుగు సంవత్సరాలలో ఎక్కడికివెళ్ళినా అతనికి అపజయమే యెదురయింది. అతని భ్రష్టమైన రాజకీయ అభిప్రాయాలు, అభివృద్ధి నిరోధక కార్యక్రమాలు నిరాకరింపబడ్డాయి. హతాశుడై పోయి చివరకు తన స్వంతరాష్ట్రమైన 'లు' రాష్ట్రానికి తిరిగివచ్చాడు. "మొదట్లో నేనెప్పుడూ నా స్వప్నాల్లో చౌరాజును చూసేవాణ్ణి. ఈ మధ్య చాల సంవత్సరాలుగా అతణ్ణి కలలోకూడ చూడలేదు. నేను ముసలివాణ్ణవుతున్నందువల్లనో లేక నా ఆశయం సిద్ధించకూడదని దేవుడు శాసించాడో" అని తన శిష్యుడు జులుతో చెప్పుకున్నాడు

అప్పుడు 'లు' రాష్ట్ర చరిత్ర కూరుస్తున్నాననే నెపంపెట్టుకొని చౌవంశ ఆచార వ్యవహారాలను వదిలేసిన వివిధ రాష్ట్రాల్లోని పరిపాలకులు, ఉన్నత వంశీకులు, బలపడుతున్న భూస్వామ్య శక్తుల "నేరాలను" కాలక్రమానుసారంగా రికార్డుచేయడానికి పూనుకున్నాడు. ఈ "తిరుగుబాటు మంత్రుల, అపవిత్ర కుమారుల" లెక్క ఎన్నడో ఒకరోజు చెల్లిస్తానని ఆశించాడు. ఈ దస్తమైన రికార్డుకే "వసంత-శరదృతు చరిత్ర (Spring and Autumn Annals) అని పేరు. భావవాదిగా కన్‌ఫ్యూషియస్ "దైవ నిర్ణయా"న్ని విశ్వసించాడు. "బానిసల్ని పరిపాలించే అధికారం"ను దైవంనుంచే శాసనంగా బానిస యజమానులు పొందారని అభిప్రాయపడ్డాడు. బానిసవిధానాన్ని నిలబెట్టాలని చేసిన ఆయన ప్రయత్నానికి యీ అభిప్రాయమే సైద్ధాంతిక పునాది.

కన్‌ఫ్యూషియస్ జీవిత చరమాంకంలో, బానిస-యాజమాన్య సంపన్నవర్గానికి ప్రాతినిధ్యంవహించే చి రాష్ట్రానికిచెందిన చియిన్, బలపడుతున్న భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యంవహించే చెన్‌హెంగ్‌ను తుడిచిపెట్టడానికి అభివృద్ధినిరోధక శక్తులతో కలసి పథకంవేశాడు. తర్వాత జరిగిన యుద్ధంలో చెన్‌హెంగ్ సైన్యాలు చియిన్ రాజును చంపేశాయి. ఈ వార్తలు రాష్ట్రానికిచేరేవరకు, కన్‌ఫ్యూషియస్ రోగశయ్యపై వున్నాడు. 71 సంవత్సరాల ముసలివాడు అయినా రోగశయ్యపైనుంచి లేచి లు రాష్ట్ర ప్రభువు ఆయ్ దగ్గరకువెళ్ళి చెన్‌హెంగ్‌ను అణచివేయడానికి సైన్యాలు పంపించవలసిందిగా ప్రాధేయపడ్డాడు. తన సైన్యాలు స్వీయరక్షణకే సరిపోయేంతగాలేవని తెలిసిన రాజు, కన్‌ఫ్యూషియస్ సూచనలను నిరాకరించాడు. కొద్ది రోజుల్లోనే తన 73వ ఏట శిథిలమైపోతున్న బానిస యాజమాన్య వర్గంకోసం యింకా విలపిస్తూ కన్‌ఫ్యూషియస్ మరణించాడు.

ఆయన మరణంతర్వాత, బలపడుతున్న భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే న్యాయవిధానానికి శిథిలమైపోతున్న బానిస-యాజమాన్య సంపన్నవర్గానికి ప్రాతినిధ్యంవహించే కన్‌ఫ్యూషియస్ విధానానికి శతాబ్దాలతరబడి పోరాటం కొనసాగింది. వసంత-శరదృతుకాలం (క్రీ. పూ 770–476) రెండోభాగంనుంచి మొదలై చిన్

వంశానికిచెందిన మొదటి చక్రవర్తి చిన్ షిహ్ హువాంగ్ (క్రీ. పూ. 259–210) చైనాను ఐక్యంచేసేవరకు యీ పోరాటం కొనసాగింది. పాశ్చాత్య హాన్ వంశకాలం (క్రీ. పూ 206–క్రీ. శ 24) నాటికి, యింక బానిస విధానాన్ని నిలబెట్టే ప్రమాదంలేని కాలం గడిచేవరకు భూస్వామ్యవర్గం క్రమంగా నిజమైన పులినుంచి కాగితంపులిగా మారింది. అప్పుడు ఫ్యూడల్ భూస్వామ్యవర్గాలు కన్‌ఫ్యూషియస్ సిద్ధాంతాలను సవరించుకుని ఫ్యూడల్ విధానానికి వుపకరించే బలమైన సిద్ధాంతంగా మార్చుకున్నారు. తక్కిన ఆలోచనా ధోరణులన్నీ శాసన బాహ్యమైపోయాయి.

కన్‌ఫ్యూషియనిజం ఒక్కటే సంప్రదాయమైపోయింది. అప్పటినుంచి గడచిన రెండు వేల సంవత్సరాలుగా అభివృద్ధినిరోధక వర్గాలు కన్‌ఫ్యూషియస్‌ను గురువుగా ప్రశంసిస్తున్నారు. ఆధునికయుగంలో ద్రోహి చాంగ్‌కై–షేక్ కన్‌ఫ్యూషియస్‌ను పూజిస్తున్నాడు. సామ్రాజ్యవాదులు, సోవియట్ రివిజనిస్టులుకూడా అదేపనిచేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని పునఃస్థాపించాలనే తన నిరర్థక ప్రయత్నాన్ని అమలుచేయడానికి లి షావ్-చీ కన్‌ఫ్యూషియస్‌ను ప్రశంసించాడు. పెట్టుబడిదారీ విధానాన్ని పునఃస్థాపించడానికి లిన్‌పియావోకూడ "నిగ్రహాన్ని అలవరచుకొని ఆచార వ్యవహారాలను కాపాడాలని" (restraining one self for restoring the rites) తహ తహలాడాడు. "విశిష్టతను కాపాడడానికి విజయమో, మరణమో పొందమని తన అనుచరులకు పిలుపుయిచ్చారు. అయినా కన్‌ఫ్యూషియస్ అనే భూతాన్ని పెకిలించితీసి, అభివృద్ధినిరోధక వర్గాలు తమ చావుని తప్పించుకోలేకపోయాయి. (ప్రస్తుతం లిన్‌పియావోను, కన్‌ఫ్యూషియస్‌లు ఖండించే ఉద్యమం చైనాలో చాల మౌలికంగా అభివృద్ధిచెందుతున్నది) కన్‌ఫ్యూషియస్‌ను ఖండించడమనేది, లిన్‌పియావోను ఖండించడంలో చాల ముఖ్యమైన అంశం. లిన్‌పియావోను సంపూర్ణంగా ఖండించాలంటే, కన్‌ఫ్యూషియస్‌నుకూడ తిరస్కరించాలి. కన్‌ఫ్యూషియస్‌నుకూడ తిరస్కరించాలి. కన్‌ఫ్యూషియనిజం, అభివృద్ధినిరోధక విధానాలను విమర్శించడంద్వారానే లిన్‌పియావో అతని ముఠా పెట్టుబడిదారీ విధానాన్ని, తిరోగమనవాదాన్ని పునఃస్థాపించడానికి చేసిన ప్రయత్నాల్లోని విప్లవ ప్రతీఘాతుక నేరాలను లిన్‌పియావో రివిజనిస్టుపంథాను, అభినవ మితవాద స్వభావాన్ని ప్రజలు మరింత స్పష్టంగా చూడగలుగుతున్నారు. లిన్‌పియావో అభివృద్ధి నిరోధక ఆలోచనల ప్రభావాన్ని సమూలంగా తుడిచిపెట్టడానికి ఇది ప్రజలను సమర్థుల్నిచేస్తుంది. ఇదంతాకూడ మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం సాధించిన అపారమైన ఫలితాలను విస్తృతపరచి మన లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడుతుంది.

(Confucius, "Sage" of All Reactionary classes in China –
SHIH HUA-TSU-
–Chinese Literature No. 6, 1974



# ఎర్ర సైన్యం యోధుడు

రెండవ విప్లవ అంతర్యుద్ధకాలం (1927-37)లో దక్షిణచైనా పర్వతప్రాంతంలో క్జియావోయాంగ్ అనే పిల్లవాడు నివసిస్తుండేవాడు. 'కొండ తోడేలు'అనే పేరుగల భూస్వామి కుటుంబానికి ఈ పిల్లవాడు పసులకాపరిగా పనిచేసేవాడు. ఈ భూస్వామి పిల్లవాని తల్లితండ్రుల నిద్దరినీ చంపేసాడు. క్జియావోకు 14 ఏండ్లు వున్నపుడు ఎర్ర సైన్యం వాళ్ళ వూరికి వచ్చింది ఈ పిల్లవాడు సైన్యానికి రాజకీయ శిక్షణ యిచ్చే నాయకుణ్ని కలుసుకొని సైన్యంలో చేరుతానని కోరాడు. కష్టంచేసే ప్రజలందరి తరపున కసితీర్చుకొని విప్లవాన్ని చివరిదాకా తీసుకపోవాలనే తనకోర్కెను తెలియబరిచాడు.

అతని తీవ్రమైన కసి. ద్వేషం గొప్ప విప్లవ పట్టుదలచూసి నాయకుడు సైన్యంలో వుండనిచ్చాడు. నాయకుడు పిల్లవాణ్ని బాకాఊదటం నేర్చుకొమ్మన్నాడు. "నేను సైన్యంలో యుద్ధాలుచేసి శత్రువును చంపడానికిచేరాను. కానీ నేను బాకా ఊదను. నాకు రైఫిల్ కావాలి అని పిల్లవాడు ఆవేశంగా జవాబుచెప్పాడు.

"యుద్ధరంగంలో బాకాఊదకుండా సైన్యాల్ని కదిలించలేం అదికూడఆయుధమే, అది విని శత్రువు భయంతో వణికిపోతాడు. మన యోధుల ఉత్సాహం పదునెక్కుతుంది", నాయకుని యీ మాటలతో క్జియావో యాంగ్ గొప్పగా చలించిపోయాడు. "బాగుంది. బాకాఊదడం అంత ముఖ్యమైనపనిగాబట్టి నేను అదేచేస్తాను"

ఒకసారి క్జియావోయాంగ్ ఒక పనిమీదవెళ్ళి తిరిగి వస్తున్నాడు. ఆయన ఒక పర్వతంమీద నడుస్తుండగా అకస్మాత్తుగా "కొండతోడేలు" అభివృద్ధినిరోధక సైన్యాలతో తమపైన దాడిచేయడానికి రావడం కనిపించింది. ఈసారి శత్రువులు చాలా సంఖ్యలో వచ్చారు. మేమేమో చాలా కొద్దిమందిమున్నాం. వీళ్ళ పథకాన్నిచెడగొట్టే ఉపాయం ఆలోచించాలి. వీళ్ళను తప్పుదారిపట్టించాలి"అని ఆలోచించి బాకా ఊదటం మొదలుపెట్టాడు. వాళ్ళపైకి చాలా చేతిబాంబులు విసిరాడు. వాళ్ళు అతని బాకావిని ఆ శబ్దం వచ్చినవేపు పరిగెత్తుకొని రావడం ప్రారంభించారు. శత్రువు మార్గం తప్పిపోవడం గమనించిన నాయకుడు తన సైన్యాన్ని వాళ్ళవెంటపడమని ఆదేశించాడు. ఎర్ర సైనికులు శత్రువును తరిమికొట్టి చాలమందిని చంపేసారు. అంతేకాదు "కొండతోడేలును"కూడ చంపేసారు.

యుద్ధం విజయవంతంగా ముగిసిన తర్వాత నాయకుడు క్జియావో యాంగ్‌ను "మంచి ఎర్ర సైన్యం యోధుడ"ని మెచ్చుకున్నాడు.

[చైనా రికన్‌స్ట్రక్ట్స్— జూన్ '74]

# ఆర్డర్ ఆఫ్ లెనిన్ - అర్హత

గండయ్య

[1924 కాన్పూరు బోల్షివిక్ కుట్రకేసులో నిందితుడయిన శ్రీ శ్రీపాద అమృత డాంగేగారు అదేకేసులో తనతోపాటు నిందితులయిన తన యిద్దరు మిత్రులకు (ముజఫర్ అహమ్మద్, షౌకత్ ఉస్మాని)కూడా ఏమాత్రం తెలియకుండా రహస్యంగా గవర్నర్ జనరల్‌కు క్షమాభిక్ష పెట్టమని వేడుకుంటూ రాసుకున్న వినతిపత్రం యిది. ఈ కేసులో సెషన్సుకోర్టు, నిందితులయిన నలుగురికి నాల్గు సంవత్సరాలు కఠిన శిక్ష విధించింది. ఈ వినతిపత్రం నేషనల్ ఆర్కివ్సులో భద్రపరచబడి మొదటినుండికూడా డాంగే కమ్యూనిస్టుపార్టీలో సామ్రాజ్యవాదుల గూఢచారి అన్న అభిప్రాయాన్ని బట్ట బయలుచేస్తున్నది. ఈ అర్హతను, వినతిపత్రాన్ని చూసేనేమో సంతోషంతో ఎగిరి గంతేసిన సామ్రాజ్యవాదుల కావలికుక్క శ్రీ బ్రెజ్నేవ్‌గారు, తన జాతి మిత్రుడు శ్రీ డాంగేగారిని సామ్రాజ్యవాదులకు చేసిన, చేస్తున్న సేవలకు మెచ్చి 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' యిచ్చి సత్కరించారు.]

యువర్ ఎక్సెలెన్సీ

కాన్పూరు బోల్షివిక్ కుట్రకేసులో నిందితులయిన నలుగురిలో నేనొకడను. ఈ క్రింది కారణాలమూలంగా మీరు నన్ను మన్నించి నా శిక్షను రద్దుచేయవలసిందిగా మిమ్మలను వేడుకుంటున్నాను. నా ప్రార్థనను గమనించగలరన్న ఆశతో మీ ముందు యీ విన్నపాన్ని వుంచుతున్నాను.

సెంట్రల్ ఇంటలిజెన్సు బ్యూరో డైరెక్టర్ కల్నల్ సి. కాటమీకు నిజానిజాల్ని తెలుపగలడు. కాబట్టి నేను విన్నవించుకున్నదానిలో నిజానిజాలు అతనిద్వారా యువర్ ఎక్సెలెన్సీ తెలుసుకోవచ్చును.

పై కేసు విచారణ జరుగుతున్నపుడు- "ప్రభుత్వం ప్రత్యేకంగా వ్యక్తులను శిక్షించాలన్న ఆసక్తితో లేదు. ఇండియాలో బోల్షివిక్కులు కుట్రచేస్తున్నారని తను ప్రజల్లో ప్రచారంచేసిన విషయాన్ని కుట్రకేసు నడపటంద్వారా ధృవపరచడమే ప్రభుత్వలక్ష్యం" అని రోజ్ అల్స్టను నాకు తెలియచేశారు. ఇండియాలో బోల్షివిక్కులు కుట్రచేస్తున్నారన్నది సత్యమని కోర్టుద్వారా ఋజువయింది కాబట్టి యిక నాకు క్షమాభిక్షపెట్టమని యువర్ ఎక్సెలెన్సీని నేను ప్రార్థిస్తున్నాను.

ఇంకొక విషయాన్నికూడా నేనిక్కడ పేర్కొంటాను. సరిగ్గా ఒకసంవత్సరం క్రితం బొంబాయి డెప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ స్టీవార్ట్ నాతో "నీకు ఈ దేశంలోనూ, విదేశాల్లోనూ కొంతమందివద్ద విశేషమైన పలుకుబడిగల స్థానం ఉంది. నీకుగల యీ పలుకుబడి ప్రభుత్వానికి ఉపయోగపడగలిగేటట్లు ఉంటే ప్రభుత్వం చాలా సంతోషిస్తుంది" అని అన్నారు. కాని అపుడు ఆ మాటల అంతరార్థం నేను తెలుసుకోలేకపోయాను. కాని యిప్పుడుకూడా నాకు అంత పలుకుబడిగల స్థానమే ఉంది. కోర్టు నన్ను బోల్షివిక్కుగా ప్రాసిక్యూషను చేయటంవల్ల అది ఇంకా ఎక్కువయిందికూడా.



నా ప్రార్థన నంగీకరించి యువర్ ఎక్సెలెన్సీ నన్ను విడుదలచేసినచో, నా పలుకుబడి నుపయోగించి యువర్ ఎక్సెలెన్సీ ప్రభుత్వానికీ, దేశానికీ సేవచేయుటకు నాకొక అవకాశమిచ్చినట్లగును.

ఇండియాలో చక్రవర్తుల సార్వభౌమత్వంపై నాకున్న అభిప్రాయం నేను మార్చుకోగలందుకు నాకు నాలుగు సంవత్సరాలు కఠినశిక్ష విధించారు. యువర్ ఎక్సెలెన్సీకి నేను విన్నవించుకునేదేమంటే నా అభిప్రాయాన్ని మార్చుకోడానికి నాకు అంత శిక్ష అనవసరం. గతంలో ఎప్పుడూకూడా నా రచనల్లోగాని, ఉపన్యాసాల్లోగాని చక్రవర్తిపట్ల స్వామిద్రోహము చేయలేదు. ఇక భవిష్యత్తులో చేయాలనుకోడంలేదు.

ఈ నా హామీ దృష్టిలోపెట్టుకొని యువర్ ఎక్సెలెన్సీ నా ప్రార్థన నంగీకరిస్తారని ఆశిస్తూ ఆ అంగీకారంకొరకు ఆతురతతో ఎదురుచూస్తున్న

యువర్ ఎక్సెలెన్సీకి అత్యంత
విశ్వాసపాత్రమైన సేవకుడు

జూలై 28, 1924

శ్రీపాద అమృత డాంగే

డాంగే బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వంపట్ల తన విశ్వాసాన్ని యీ లేఖ ద్వారా తెలియచేసి ఎంతసేపూ ఎప్పుడు జెయిల్‌నుండి విడుదలయి తన స్వామిభక్తిని ప్రకటించుకోగల అవకాశాలు తనకు లభ్యమవుతవా అని ఎదురుచూస్తూ దూరాలోచన కోల్పోయాడు. ఆ దురాలోచన స్వామిభక్తుడికికాకుండా స్వాములకే కలిగింది. శిక్ష విధింపబడినవెంటనే వదిలేస్తే ప్రజలముందు తమ భక్తుని స్వరూపం బట్టబయలయి తమకొక విశ్వాసమైన కుక్క లేకుండాపోతుందనే భయంతో ఎలాగో నాలుగు సంవత్సరాల శిక్షాకాలాన్ని ఒక సంవత్సరంచేసి తమ భక్తవాత్సల్యాన్ని ప్రదర్శించారు. ఆ భక్తవాత్సల్యాన్ని గానంచేస్తూ ఎల్లకాలం కుక్కలా పడివున్న శ్రీ శ్రీపాద అమృత డాంగేగారిని సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు ఈనాడు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్'తో సత్కరించారు. ఈనాడు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు యిలాంటి డాంగేలనూ, టిటోలనూ, కాస్ట్రోలనూ సత్కరించి అక్కున చేర్చుకుంటూ లెనిన్ స్మృతినే కళంకపరుస్తున్నారు. దొంగలు, దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లుగా సామ్రాజ్యవాదులతో మిలాఖత్‌అయి ప్రపంచాన్ని తమమధ్య విభజించుకుంటూ ప్రపంచ విప్లవ కేంద్రమయిన జనచైనాను నాశనంచేయాలని చూస్తున్నారు. విప్లవాలయుగం అయిన నేటి కాలంలో వీరి ఆటలు సాగుతాయనుకోడం వట్టి భ్రమ. నయాజార్ చక్రవర్తులైన సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల ముఠాయొక్క పరమదుర్మార్గపు లక్షణాలు ఎంత ఎక్కువగా బయటపడితే అంత త్వరగా సోవియట్ ప్రజలు, మిగతా ప్రపంచ ప్రజలు సోవియట్ రివిజనిజాన్ని చారిత్రక వస్తు ప్రదర్శనశాలలోకి తరలిస్తారు.

[లేఖ 'మై సెల్ఫ్ అండ్ ది కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా' అన్న పుస్తకం ఆధారంగా అనువదింపబడింది.]

వార్తలు – ఖండనలు :

## కోర్టులో కలకలం : 'కామ్రేడ్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలి'

నవంబరు 12న సికిందరాబాదు కుట్రకేసులో నిందితులను కోర్టులో హాజరుపర్చినపుడు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలి, బీహార్ ప్రజల పోరాటాన్ని బలపరచండి, బీహార్ ప్రజలారా, సాయుధపోరాటమే మీ మార్గం. ప్రగతిశీల విద్యార్థులపై పోలీసు దమనకాండ నశించాలి, వంటి నినాదాలు మెుక్కవగా వినవచ్చాయి. ఇటీవల యూనివర్సిటీ విద్యార్థులపై మోపినకేసు సందర్భంగా పి.డి.ఎస్.యు., ఆర్.ఎస్.యు. లకు చెందిన విద్యార్థులు, ఇతర జనంకూడ వందల సంఖ్యలో కోర్టులో, కోర్టు ఆవరణలోచేరి నినాదాలతో, పాటలతో తమ గొంతుకలిపారు. కోర్టులో తనకేసు తానే వాదించుకుంటున్న మా-లె. పార్టీ కార్యకర్త ఇంగువ మల్లికార్జునశర్మ అప్రూవర్లను హాజరు పరచేటప్పుడు చాల సమయం పడుతుంది కనుక తమకు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటుచేయాలని డిమాండు చేసారు. మేజిస్ట్రేటు అంగీకరించాడు. జెయిల్లో సి క్లాసు ఖైదీల పరిస్థితులు మెరుగుపరచాలని, కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలని. దేశంలో అన్ని జైళ్ళలోని నికృష్ట పరిస్థితులను మెరుగుపరచి ముఖ్యంగా నక్సలైట్ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, మీసా, పి.డి. వంటి ప్రజావ్యతిరేక చట్టాలను ఎత్తివేయాలని బీహార్ ప్రజల పోరాటంలో అరెస్టయిన వేలాది మందిని వెంటనే విడుదల చేయాలని. తాను, సుబ్బారెడ్డి, వీరభద్రం, యాదవరెడ్డి, మల్లయ్య వెంకటయ్య ఆరు రోజులు (6–11 నవంబర్) నిరాహారదీక్ష చేసిన విషయం ప్రకటిస్తూ, బీహార్ ప్రజల పోరాటాన్ని బలపరుస్తూ యిక్కడకూడ అధికధరలకు అవినీతికి వ్యతిరేకంగా పోరాటాన్ని చేపట్టవలసిందిగా మల్లికార్జునశర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నవోదయ సాంస్కృతిక సంస్థ సభ్యుడు రచయిత బాపూజీ చౌదరిని హైదరాబాదులో ఎవరో రౌడీలు కొట్టారని అతనివద్దవున్న 'జీవనాడి' కాగితాలను లాగుతున్నారని యీ చర్యను తాము ఖండిస్తున్నామన్నారు వరవరరావు. కోర్టుహాలు బయటికివస్తూ కోర్టు ఆవరణలో ప్రజలనుద్దేశిస్తూ వరవరరావు ప్రసంగించారు. బీహార్ ప్రజల పోరాటాన్ని విప్లవ రచయితలు విప్లవకారులు బలపరుస్తున్నారని, అక్కడ సాగుతున్న పోలీసు హింసాకాండను ఖండిస్తున్నామని, నిజానికి దేశమే ఒక పోలీసురాజ్యమయిందని ఐతే బీహార్ ప్రజలు అసెంబ్లీ రద్దుతోమాత్రమే ఆగకుండా తమ పోరాటాన్నిముందుకు తీసుకపోయి భారత రైతాంగ సాయుధ పోరాటంలో సంలీనపరచాలని విజ్ఞప్తి చేసారు.



బీహార్ ప్రజల పోరాటానికి మద్దతుగా యీ రాష్ట్రంలోకూడ విద్యార్థులు, కార్మికులు, మేధావులు, రైతాంగం అధికధరలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని నిర్మించాలన్నారు. ఆదిలాబాదు జిల్లాకు చెందిన రైతాంగ గెరిల్లాలు, మా-లె పార్టీ కార్యకర్తలు భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుకొరకు ప్రజాఉద్యమాన్ని నిర్మించవలసిందిగా విజ్ఞప్తి చేసారు. ప్రపంచంలో నాగరిక దేశాలన్నీ ఏనాడో ఉరిశిక్షలు రద్దుచేసాయని, ప్రపంచంలోకెల్లా పెద్ద ప్రజాస్వామ్యదేశంగా చెప్పుకుంటున్న భారతదేశం యీ అమానుషమైన ఉరిశిక్షను రద్దుచేయకపోవడం సిగ్గుచేటని అన్నపుడు అక్కడ గుమిగూడిన వందలాది జనంకూడ 'సిగ్గు సిగ్గు' అని బిగ్గరగా నినదించారు. దేశంలో జైళ్ళలోవున్న నికృష్ట పరిస్థితుల గురించి ప్రపంచంలోని ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తులు అందరూ ఆందోళన వ్యక్త పరుస్తున్నారని, ముఖ్యంగా రాజకీయ ఖైదీల స్థితులపట్ల ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నారని, అయినా ప్రధానికి హోంమంత్రికి అసలు చీమకుట్టినట్లయినా లేదని. రాజకీయ కారణాలపైన అరెస్టయినవారిని రాజకీయఖైదీలుగా గుర్తించాలని ఆందోళన చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసారు. రైల్వే కార్మికులపై, నెల్లిమర్ల కార్మికులపై పెట్టిన కేసులన్నీ విరమించుకోవాలని డిమాండ్ చేసారు. నిమ్మపల్లి హరిజనులపై, కరీంనగర్ జిల్లా రైతాంగంపై పెట్టిన అక్రమ కేసులను విరమించుకోవాలని డిమాండ్ చేసారు. పి.డి.ఎస్. నవోదయ విద్యార్థులపై యిటీవల జరిగిన దాడులు చూస్తే శాస్త్రీయ విద్యా విధానం కోరుతున్న సామ్యవాద భావాలుగల విద్యార్థులపై ఆర్.ఎస్.ఎస్.తో మిలాఖతయి పోలీసులు కుట్రపన్నుతున్నారన్నది స్పష్టమవుతున్నదని, వీళ్ళపై పెట్టిన అక్రమకేసులన్నీ విరమించుకోవాలని డిమాండ్ చేసారు. శర్మ, చెరబండరాజు పాడిన పాటలు జనమంతా అందుకొని పాడారు.

— ప్రజాసాక్షి

## రాష్ట్రవ్యాప్తంగా కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలరద్దుకై డిమాండ్

శ్రీకాకుళం జిల్లా కణుగులవలస అభ్యుదయ యువజన సంఘం వారు, నిజామాబాదు జిల్లా అర్సపల్లి ప్రజా సంఘం వారు, ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగు కాలేజీ, గుంటూరు హిందూ కాలేజీ, యస్.కె.పి. ప్రభుత్వ కళాశాల, చీరాల ఎ. ఆర్. అండ్ వై ఆర్.యన్. కళాశాల, అమలాపురం వై.యన్. కళాశాల, యన్.కె.ఆర్. కళాశాల; నిజామాబాదు జి.ఎ. కళాశాల, రేపల్లె ఎ.బి.ఆర్. కళాశాల, నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్, విజయవాడ శాతవాహన కాలేజీ, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ, కర్నూలు ప్రభుత్వ కళాశాల, బాపట్ల సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాలల అధ్యక్షులు, కార్యదర్శులు; ఖమ్మం జిల్లా పౌరహక్కుల సంఘం, విరసం శాఖ, ఖమ్మం తాలూకా

రైతుకూలీ సంఘం— రా.వి. శాస్త్రిగారు, విశాఖ రచయితల సంఘం, ఆంధ్ర విశ్వ విద్యాలయ అభ్యుదయ విద్యార్థులు, ఎడిస్టు సొసైటీ సెక్రటరీ జయగోపాల్‌గారు,— అనేక మంది పాఠకులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

* * *

కర్ణాటక విప్లవ కమ్యూనిస్టుపార్టీ స్టేటుకౌన్సిలు, ఆదిలాబాదు రైతాంగగెరిల్లాలు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లపై ఉరిశిక్షలు రద్దుచేయాలని. బెంగాల్‌లోని సి.పి. ఐ (ఎం.ఎల్.) కార్యకర్తలనందరిని; సికింద్రాబాదు, రాజమండ్రి మొదలగు జైళ్ళలో వున్న సి.పి.ఐ (ఎం.ఎల్) కార్యకర్తలనుకూడ బేషరతుగా విడుదలచేయాలని. విరసం రచయితలపై, కార్యకర్తలపై మోపబడిన కుట్రకేసులను ఎత్తివేయాలని— లేకపోతే కర్ణాటక రాష్ట్రమంతటా పెద్ద ఎత్తున ఉద్యమం తీయగలమని ప్రధాన మంత్రికి, రాష్ట్రపతికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి లేఖలు వ్రాశారు.

* * *

కామ్రేడ్ యస్.ఎ. రవూఫ్— "ప్రజల కోసం సర్వం త్యాగంచేసిన కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలను రద్దుచేయాలని" డిమాండు చేశారు.

* * *

ఖమ్మం జిల్లా పౌరహక్కుల సంఘం— కా॥ కిష్టాగౌడ్, భూమయ్యల ఉరిశిక్షలు రద్దుచేయాలని. విరసం రచయితలను బేషరతుగా విడుదలచేయాలని. కామ్రేడ్ వెల్లి జానయ్య హత్యపై బహిరంగ విచారణ జరపాలని 24-11-74 సమావేశంలో తీర్మానించింది. విరసం కార్యవర్గ సభ్యుడు షరిటాల శ్రీరాములు అక్రమఅరెస్టును ఖండించింది.

* * *

మహబూబ్‌నగర్ జిల్లా విరసం శాఖ ప్రభుత్వ జులుం అరాచకత్వాన్ని, మేధావులపై, విప్లవ రచయితలపై ప్రభుత్వ నిర్బంధకాండను ఖండించింది. నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది— ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ 10-11-74న ఖమ్మంలో జరిగిన తన 3వ మహాసభలో విప్లవ రచయితల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ ఒక ఏకగ్రీవ తీర్మానం చేసిందని దాని సహకార్యదర్శి చక్రపాణి తెలిపారు.

* * *

పార్వతీపురం కుట్రకేసు సందర్భంగా విశాఖ కోర్టులో అప్రూవర్ సముద్రాల సత్యనారాయణను నాలుగురోజులు డిఫెన్స్ లాయర్ క్రాస్ ఎగ్జామిన్ చేశారు— తర్వాత 25-11-74న కోర్టులు ధిక్కరిస్తున్న కామ్రేడ్స్‌ని, సాక్షిని ప్రశ్నించవల్సిందిగా "జడ్జి"



కోరగా కా॥ రవూఫ్ "నేడు భారతదేశంలో అంతర్యుద్ధం సాగుతోంది— ఒకటి విప్లవ శిబిరం, రెండోది విప్లవ ప్రతిఘాతుక శిబిరం. ఈ సాక్షి విప్లవ ప్రతిఘాతుక శిబిరానికి చెందినవాడు. అభివృద్ధినిరోధక ప్రభుత్వ యంత్రాంగంలో మీరూ ఒక భాగమే. బూర్జువా కోర్టుల్ని మేం గుర్తించం. మేం విప్లవకారులం విప్లవాన్ని కొనసాగిస్తాం. చారుమజుందార్ నిర్మించిన కమ్యూనిస్టుపార్టీ (మా-లె)లో సభ్యులమైనందుకు మేము చాలా గర్విస్తున్నాం" అన్నారు— కా॥ కె.జి. సత్యమూర్తి శ్రీశ్రీ గీతాన్ని చదువుతూ

జడ్జీనుద్దేశించి "దొంగనోట్ల దొంగవోట్ల రాజ్యం ఒక రాజ్యమా?
లంచగొండి వెధవలిచ్చు సాక్ష్యం ఒక సాక్ష్యమా?" అన్నారు—

ప్రభుత్వాధినేతలను ద్దేశిస్తూ "కుట్రకేసు బనాయించి కులికేవా దొమ్మరీ
గూడుపుఠాణీ చేసిందెవరో చూద్దామ్మరి!" అన్నారు—

అప్రూవర్ నుద్దేశించి "ప్రజాసేన నడుస్తోందిరా నీ గుట్టును
ప్రజలముందు పడేస్తుందిరా
ప్రజా కోర్టు జ్వలిస్తోందిరా
నీ తప్పుకి తగిన శిక్ష విధిస్తుందిరా" అన్నారు—

బూర్జువా కోర్టులు నశించాలి! ప్రజా కోర్టులు వర్ధిల్లాలి! ఇన్‌కిలాబ్ జిందాబాద్. అమరవీరుల ఆశయాల్ని సాధిస్తాం! అని గోరు మాధవరావు నినాదాలిచ్చారు—

కామ్రేడ్స్ కిష్టాగౌడ్ భూమయ్యలపై ఉరిశిక్షలు వెంటనే రద్దుచేయాలని, నక్సలైట్ ఖైదీలపై జరుగుతున్న దమననీతికి నిరసనగా, నక్సలైట్ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, వీహారు ప్రజాఉద్యమంపై హింసాకాండకు వ్యతిరేకంగా, ఖైదీల సౌకర్యాలు మెరుగుపర్చాలని, నిషేధింపబడని సాహిత్యం ఏ ఆంక్షలు లేకుండా ఇవ్వాలని. MISA, P.D.act, D I R వంటి ప్రజావ్యతిరేక చట్టాలు రద్దుచేసి, అక్రమ కేసుల్లో నిర్బంధించిన రాజకీయ ఖైదీలనందరినీ విడుదలచేయాలని డిమాండుచేస్తూ సికింద్రాబాదు జైల్లో వున్న (మా-లె) పార్టీ కార్యకర్తలు కామ్రేడ్స్ జంగువ మల్లికార్జునశర్మ, సుబ్బారెడ్డి, వీరభద్రం, యాదవరెడ్డి, బి.మల్లయ్య, సి.హెచ్. వెంకటయ్య మున్నగువారు నవంబరు 6 నుండి 11 వరకు నిరాహార దీక్ష చేశారు. కొన్ని డిమాండ్లను సాధించుకొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రజా వుద్యమాన్ని నిర్మించవలసిందిగా ప్రజాస్వామ్య వాదులందరకూ విజ్ఞప్తి చేశారు.

* * *

25-11-74న కామ్రేడ్ గోరు మాధవరావు రెండవ అడిషనల్ సెషన్సుకోర్టులో ప్రకటనచేస్తూ— ప్రియతమ నాయకులు చారుమజుందార్, వెంపటాపు, పంచాది, కైలాసం, పాణిగ్రాహి, భాస్కరరావు, మల్లిక్ మొదలగు అమరవీరుల పాత్రనూ, వారి నాయకత్వంలో పోరాటం ఎలా ముందుకు వెళ్ళింది వివరంగా చెప్పారు— దేశంలో

ఈనాడు జరిగే అంతర్యుద్ధంలో వర్గశత్రు నిర్మూలనాయుద్ధం యొక్క అవశ్యకతను నొక్కిచెప్పారు. సాయుధ పోరాటానికీ ఆర్థిక పోరాటాలు ముందు షరతనీ ఆర్థిక పోరాటాలద్వారా సాయుధపోరాట చైతన్యం వస్తుందనే కుహనావిప్లవకారుల వాదనను, శ్రీకాకుళ పోరాటం తప్పనీ, మా-లె పార్టీ స్థాపించడమే తప్పనీ, ఈనాడసలు పార్టీయే లేదని ప్రచారంచేస్తూ విప్లవోద్యమాన్ని విచ్ఛిన్నంచేయ ప్రయత్నిస్తున్న విద్రోహుల బూటకత్వాన్ని నిశితంగా విమర్శించారు.

* * *

మహోజ్జ్వల శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటపు 6 వ వార్షికోత్సవాన్ని 25-11-74 న విశాఖ జైలులో మా-లె- విప్లవకారులు ఎర్రజెండా నెగరేసి "ఓ అరుణ పతాకా! గైకొను మా రెడ్ సెల్యూట్" అనే పాణిగ్రాహిపాట పాడుతూ విప్లవాభినందన చేశారు.

* * *

అదేరోజు ఉదయం కొత్తగూడెం పట్టణ సెంటర్లలో- "మావో ఆలోచనావిధానం వర్ధిల్లాలి, చైర్మన్ మావో జిందాబాద్" అంటూ మావో పోస్టరూ, ఉన్నదొక్కటే దారి చారుమజుందారి, అన్నిరకాల రివిజనిజం నశిస్తుంది, వర్గ శత్రు నిర్మూలన పంథా వర్ధిల్లుతుంది, చారుబాబుకు విప్లవజోహార్లు" అంటూ చారుమజుందార్ పోస్టరూ, 'చావదు చావదు సత్యం చావదు, శ్రీకాకుళ సత్యం చిరంజీవి, వెంపటాపుకు విప్లవ జోహార్లు" అంటూ సత్యం పోస్టరూ, "స్త్రీజాతిరత్నం పంచాది నిర్మల, నిర్మల నడచిన బాట స్త్రీ జాతికి విముక్తిబాట, నిర్మలను హత్యచేయించిన కసాయి ఇందిరను కాటికి పంపండి" అంటూ నిర్మల ఫోటోతో పోస్టరూ శ్రీకాకుళ రైతాంగ పోరాటపు 6వ వార్షికోత్సవాన్ని గుర్తుచేస్తూ ప్రజలముందు కళకళలాడుతూ కన్పించాయి-

* * *

చిత్రహింసలతోను బూటకపు కేసులతో అభ్యుదయకర శక్తులను అణచగలరా?

10-12-74న వరంగల్ ఇంజనీరింగు కాలేజీలో జరిగిన గొడవల నాసరాగా తీసుకొని అభివృద్ధి నిరోధకశక్తులు పోలీసులతో కుమ్మక్కై అభ్యుదయశక్తులను పూర్తిగా తుడిచివేయాలని కుట్ర పన్నుతున్నారు. గొడవలతో సంబంధంలేని- మూడు నెలల క్రితమే కాలేజీలో చేరిన మొదటి సంవత్సరపు విద్యార్థులను, మరికొంతమంది అభ్యుదయ విద్యార్థులను ఆటలు ఆడుకొంటున్నప్పుడు అరెస్టుచేసి- వారిని చిత్రహింసలకు గురిచేసి భయపెడుతున్నారు కిరాతక పోలీసు మూకలు. కాంపసును పోలీసుశిబిరంగా మార్చి, ప్రశాంత వాతావరణాన్ని కల్లోలం చేశారు. రూములన్నీ సోదాచేయటం, విద్యార్థులకై వేటాడటం, దొరికినవాళ్ళని చితకబాదటం చేస్తున్నారు. గొడవలతో సంబంధంలేనివారిపై బూటకపు కేసులు బనాయించి, వారిని లొంగదీసుకోవాలని కుట్ర పన్నుతున్నారు- పోలీసుల యీ కిరాతక దౌర్జన్యకాండను ఖండించాలని ప్రజాస్వామ్యవాదు లందరకూ విజ్ఞప్తి చేస్తున్నాం-

రాడికల్ స్టూడెంట్స్-

రీజనల్ ఇంజనీరింగు కాలేజి, వరంగల్.

* * *

విద్యార్థి కాంగ్రెస్, ABVP (అఖిలభారత విద్యార్థి పరిషత్)విద్యార్థి ఫెడరేషన్, యూత్ ఫెడరేషన్ల ప్రజావ్యతిరేకధోరణిగల విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థి ఉద్యమాలకు ద్రోహంచేసే, ప్రభుత్వం కొమ్ముకాసే యీ సంస్థలను ప్రతిఘటించి నాశనం చెయ్యాలని రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(అనంతపురంజిల్లా) వారు ప్రకటించారు. బూటకపు ఎన్నికలని బహిష్కరించాలని, కుల, మత, జాతీయ దురహంకార శక్తుల్ని ప్రతిఘటించాలని, ఇప్పటికే సాగుతున్న విప్లవ పోరాటంలో భాగంగా విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్మించాలనికూడా వారు ప్రకటించారు.

* * *

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన 151 మంది న్యాయవాదులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్ల ఉరిశిక్షలు రద్దుచేయాలని డిమాండు చేశారు- ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు ఈ విషయాన్ని పత్రికలకు తెలియజేశారు-

* * *

శ్రీ రావి సుబ్బారావుగారి స్మృతికి విరసం వరంగల్ శాఖ తన సంతాపాన్ని తెలియజేస్తోంది-

* * *

ప్రముఖ లాయరు, పార్టీ నాయకులు అయిన శ్రీ రావి వెంకటసుబ్బారావుగారి మరణానికి గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం తన సంతాపాన్ని తెలుపుతున్నది. వారి కుటుంబానికి తన సానుభూతినికూడా తెలుపుతున్నది.

ఇట్లు,

(సం) జి. కోటేశ్వరరావు, అడ్వకేట్.

సెక్రటరి, గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం.

బ్రాడీపేట, గుంటూరు-2

వివరణలు :

అంతర్జాతీయగీతం రాసిన కవి 'యూజిన్ పాటియర్'. సృజన డిసెంబరుసంచిక 25వ పేజీలో రాసినట్లు 'పియరీ డిజైటర్' కాదు. పాటియర్ 1871 జూన్‌లో 'ఇంటర్నేషనల్' రాశాడు. '87 లో చనిపోయాడు. ఆయన చనిపోయిన ఏడునెలల తర్వాత ఫ్రెంచి కార్మికుడు, పాటలకు సంగీతం కూర్చేవాడు (కంపోజర్) అయిన పియరీడిజైటర్ పాటియర్ పోరాడుతూ చనిపోయేదాకా రాసిన పాటలు చదివాడు. చదివి ఉత్తేజాన్ని పొంది వాటికి స్వరకల్పన చేశాడు. లిల్లీ అనే ఫ్రెంచి నగరంలో పత్రికలమ్ముకునేవాళ్ళ సమావేశంలో జూలై '88 లో మొదటిసారిగా అంతర్జాతీయ గీతాన్ని బృందగానంలో ప్రదర్శించాడు.

2) డిసెంబర్ '74 సృజన సంచికలో 'చైనాపై అరుణతార' సమీక్ష మూడవ పేజీలో రాల్ఫ్‌ఫాక్స్, క్రిస్టోఫర్ కాడ్వెల్‌ల పేర్లు రాల్ఫ ఫ్రాంకు, క్రిస్టోఫర్, కాడ్వెల్‌లుగా విభజించబడినవి. ఈ పొరబాటుకు చింతిస్తున్నాం.

3) డిసెంబర్ సృజన 46వ పేజీ 6వ తీర్మానంలో........" 13 మంది పి. డి. యస్. యు. విద్యార్థులను, మరికొందరు రాడికల్ విద్యార్థులనూ" అని చదువుకోవాలని కోరుతున్నాం.

లే :

బీహార్ : గేయంలో రాసినట్లు "నాడీస్పందనను" థర్మామీటర్లు కొలవలేవు. స్టెతస్కోపులు మాత్రమే గ్రహిస్తాయి.

— ఒక పాఠకుడు

మావో ఆలోచనతో
జీవితాన్ని వెలిగించుము
విప్లవసందేశాన్ని
వాడ వాడ వినిపించుము
శ్రమజీవుల సమరశక్తి
అడుగడుగున గుర్తించుము

"కళాఖండాలు రాజకీయంగా ఎంత అభివృద్ధికరమైనవి అయినప్పటికీ, సరైన కళారూపంలో చూపకపోతే అవి శక్తివంతంగా పని చేయలేవు."

— మావో

---

# ఇది న్యాయస్థానం కాదు
# ధృతరాష్ట్రుని ఆస్థానం

ఈ కోర్టు కార్మికులకు, పేదరైతులకు విప్లవ మేధావులకు వ్యతిరేకంగా దోపిడీవర్గాల చేతిలో ఉన్న తేనెపూసిన కత్తి.

దుష్టులైన దోపిడీదార్ల దుష్కార్యాలపై 'పవిత్ర జలాలు' చిలికరించే కపటసన్యాసి యీ కోర్టు—

ఇది స్వార్థపరుల కావలి-కుక్క.

విశాఖ కోర్టులో కామ్రేడ్ సత్యమూర్తి.

---

వెలువడింది :　　　　రెండవ ముద్రణ

# యజ్ఞం

కాళీపట్నం రామారావు కథల సంపుటి

వెల : 4 రూ.

ప్రతులకు :
కాళీపట్నం రామారావు
46-18-19, మండావారిపేట
దొండపర్తి, విశాఖపట్నం-4

సృజనవద్దకూడా కాపీలు దొరుకుతాయి.

---

వెలువడింది :　　　　వెలువడింది :

# ఆచరించండి

(వ్యాసాలు)

రచన : డాక్టర్ మిత్రా

ప్రతులకు :　　　　వెల : 1—25
భీమన సూరిబాబు
తమ్మనవారి లేన్, కొత్తపేట, విజయవాడ-1

## నిజాలు

సంకలనం: వలసాని ప్రసాదరావు

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో, హోచిమిన్, గోర్కీ, లూషన్, జ్యూలియస్ ఫ్యూజిక్, క్రిస్టోఫర్ కాడ్వెల్, మయకోవస్కీ, రాల్ఫ్ ఫాక్స్, జాన్ లండన్, శ్రీ శ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, యూజిన్ పాటియర్‌ల చిత్రాలు, కళా-సాహిత్యాలను గురించిన వారి భావాలతో వెలువడిన పాకెట్ సైజు ఆల్బం.

వెల: రూపాయిపావలా   ఏజెంట్లకు 25% కమీషన్

వి. పి. గా పంపబడవు.

ప్రతులకు:

నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్: హైదరాబాద్.

---

### శ్రామికవర్గ సాహిత్యంకోసం

రండి   రాయండి

శ్రామికవర్గ ప్రచురణలు
9_2_197, గిర్మాజీపేట
వరంగల్. 506 002

కొత్తగా తెరిచిన మా బుక్‌షాప్‌లో మా ప్రచురణలు మాత్రమే కాక, మార్క్స్, ఎంగెల్స్, మావో, చారుమజుందార్, మార్క్సిస్ట్-లెనినిస్ట్ మౌలికఅధ్యయన గ్రంథాలు (తెలుగులో, ఇంగ్లీషులో) విప్లవ రచయితల సంఘంవారి అన్ని రచనలు, పత్రికలుకూడ అమ్మబడును. రండి. ఆర్డర్లు పంపించండి. పోస్టుఖర్చులు మీరే భరించుకోవాలి.

ఏ పుస్తకం కావాలన్నా అడ్వాన్స్‌గా డబ్బు పంపించాలి.


---

'ప్రజాకంఠం' శీర్షిక కింద పాఠకుల నుండి 'సృజన' లో వస్తున్న రచనలమీద నిష్పాక్షికమైన, నిర్మాణాత్మకమైన విమర్శలను ఆహ్వానిస్తున్నాం.

— సం॥

---

# డిసెంబర్ 25న ప్రపంచ శ్రామికవర్గం స్టాలిన్ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నది



[నవయుగ బుక్‌హౌస్ ప్రచురించిన 'నిజాలు' సౌజన్యంతో]

లెనిన్ జీవితకాలంలో స్టాలిన్, జారిజానికివ్యతిరేకంగాపోరాడాడు. మార్క్సిజాన్ని ప్రచారంచేసాడు. లెనిన్ నాయకత్వంవహించిన బోల్షివిక్‌పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. 1917 విప్లవానికి బాటలు వేసిన పోరాటంలో పాత్ర వహించాడు. అక్టోబర్ విప్లవం తరువాత శ్రామికవర్గ విప్లవ ఫలితాలను పరిరక్షించడానికి పోరాడాడు.

సామ్యవాద పారిశ్రామికీకరణ వ్యవసాయక సమిష్టికరణ పంథాలో సామ్యవాద పరిణామంలో, సామ్యవాద నిర్మాణంలో సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ, సోవియట్ ప్రజలు గొప్ప విజయాలు సాధించడంలో స్టాలిన్‌నాయకత్వంవహించాడు. లెనిన్ మరణం తరువాత లోపలి శత్రువులతో, బయట శత్రువులతో స్థిరసంకల్పంతో పోరాడడంలో ప్రపంచంలో మొట్టమొదటి సామ్యవాద రాజ్యాన్ని కాపాడుకుని సుసంఘటితం చేసుకోవడంలో సోవియట్‌యూనియన్ కమ్యూనిస్ట్ పార్టీ (సి.పి.ఎస్.యు) కి, సోవియట్ ప్రజలకు స్టాలిన్ నాయకత్వం వహించాడు.

ఫాసిస్టువ్యతిరేక యుద్ధంలో మహత్తర విజయంవైపు సి.పి.ఎస్.యు, సోవియట్ ప్రజలు, సైన్యం, సాగించిన కష్టభూయిష్టమైన తీవ్రమయిన పోరాటానికి స్టాలిన్ నాయకత్వంవహించాడు.

వివిధ రకాల అవకాశవాదాలకు వ్యతిరేకంగా, లెనినిజానికి శత్రువులయిన ట్రాట్స్కీ-మైట్లు, జినోవివైట్లు, బుఖారినైట్లు యింకా యితర బూర్జువా ఏజెంట్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో స్టాలిన్ మార్క్సిజం-లెనినిజాన్ని కాపాడి అభివృద్ధిపరిచాడు.

క్షతిలేని మార్క్సిస్టు-లెనినిస్టు గ్రంథాలుగా పేర్కొనదగిన ఎన్నో సిద్ధాంత రచనల ద్వారా స్టాలిన్ అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమానికి చెరిగిపోని సేవలుచేశాడు.

మొత్తంమీద శ్రామికవర్గ అంతర్జాతీయతకు చైనా ప్రజలతోసహా విప్లవ పోరాటాలు సాగిస్తున్న ప్రజలందరికి గొప్పగా వుపకరించేటిదిగావున్న విదేశాంగ విధానాన్ని అనుసరించడంలో సోవియట్ పార్టీకి, ప్రభుత్వానికి స్టాలిన్ నాయకత్వం వహించాడు.

పోరాటానికి మార్గదర్శకమైన చారిత్రక ప్రవాహానికి అగ్రభాగాన సామ్రాజ్యవాదులకు, అభివృద్ధినిరోధకు లందరికి రాజీలేని శత్రువుగ స్టాలిన్ నిలిచాడు.

మహత్తరమైన సి.పి.ఎస్.యు.తో మహత్తర సోవియట్ ప్రజలతో సన్నిహితంగా ముడివడి స్టాలిన్ కార్యకలాపాలన్నీ మొత్తం ప్రపంచ ప్రజల విప్లవ పోరాటాలతో విడదీయరానివి. స్టాలిన్‌జీవితం ఒక గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టు, ఒక గొప్ప శ్రామికవర్గ విప్లవకారుని జీవితం.

[స్టాలిన్ చైనా కమ్యూనిస్టు పార్టీ అంచనా నుంచి]